ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం


నిఖార్సైన జర్నలిజం

గురువారం, జులై 2, 2026 | సంపుటి - 22 | సంచిక 275 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## మీ రోజులు దగ్గరపడ్డాయి..
## అందుకే ఈ విమర్శలు

### నితిన్ నబీపై విమర్శలకు శుక్లా కౌంటర్



**న్యూఢిల్లీ,జూలై1(నినాదం):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను రేవంత్ ఎగతాళి చేయడంపై ఆ పార్టీ జాతీయ ప్రతినిధి ప్రేమ్ శుక్లా మండిపడ్డారు. మీ రోజులు దగ్గరపడ్డాయి' అంటూ హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌తో తెలంగాణను పోల్చడంపై తెలంగాణ సీఎంకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

2

## వైఫల్యాలపై దృష్టి
## మరల్చే ఎత్తులు

- రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీసారు
- అన్నదాతల అసలు సమస్యలపై పట్టింపేది
- వైఫల్యాలపై చర్చకు సిద్ధంగా ఉన్నాం
- సిఎం రేవతంంకు హరీష్ రావు సవాల్



# ఆత్మగౌరవమే అస్త్రం

> గ్రామాల నుంచి రాష్ట్ర స్థాయి రాజకీయాల వరకు ఎదిగిన ఈటల జీవితం తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయం



# రాజకీయాలే రణరంగం

## ఈటల రాజేందర్ రాజకీయ ప్రస్థానం



**(బిజిగిరి శ్రీనివాస్, ఎడిటర్-నినాదం):**

*తెలంగాణ రాజకీయాల్లో ఉద్యమ స్ఫూర్తి, ప్రజా అనుబంధం, స్పష్టమైన వైఖరితో ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకులు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై స్పందిస్తూ ఉద్యమాల బాట పట్టిన ఆయన, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో కీలక పాత్ర పోషించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర స్థాయి రాజకీయాల వరకు ఎదిగిన ఈటల ప్రస్థానం తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది.*

### ఉద్యమం నుంచి అధికారానికి

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉద్ధృతంగా సాగిన రోజుల్లో ప్రజల్లో చైతన్యం నింపుతూ, ఉద్యమ లక్ష్యాలను గ్రామ గ్రామానికి తీసుకెళ్లిన నాయకుల్లో ఈటల రాజేందర్ ముందువరుసలో నిలిచారు. తెలంగాణ ఆత్మగౌరవం, స్వీయ పాలన, ప్రాంతీయ హక్కుల కోసం జరిగిన ఉద్యమంలో ఆయన గళం బలంగా వినిపించింది. ఉద్యమ ఫలితంగా రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి తెలంగాణ ప్రభుత్వంలో కీలక శాఖలను నిర్వహిస్తూ పాలనలో తనదైన ముద్ర వేశారు.

### ఆత్మగౌరవ రాజకీయాలే తన బలం

ఈటల రాజేందర్ రాజకీయ జీవితంలో తరచూ వినిపించే పదం "ఆత్మగౌరవం". పార్టీ కోసం, తెలంగాణ కోసం పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన, అధికారంలో ఉన్న సమయంలో కూడా తన అభిప్రాయాలను నేరుగా వ్యక్తపరిచే నాయకుడిగా పేరు సంపాదించారు. ప్రభుత్వ నిర్ణయాల విషయంలోనూ, ప్రజా సమస్యల విషయంలోనూ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పడం ఆయన రాజకీయ శైలిగా మారింది.

### హుజూరాబాద్ తీర్పు – రాజకీయ పునర్జన్మ

టీఆర్ఎస్‌ను వీడి వచ్చిన తర్వాత జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో చారిత్రాత్మకంగా నిలిచింది. అధికార యంత్రాంగం, భారీ రాజకీయ ఒత్తిళ్ల మధ్య కూడా ప్రజలు తన వెంటే నిలిచారని ఈటల వర్గం చెబుతుంది. ఆ ఎన్నిక ఫలితం కేవలం ఒక నియోజకవర్గ విజయం మాత్రమే కాకుండా, వ్యక్తిగత రాజకీయ బలానికి నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.



### మల్కాజిగిరి ప్రజల మధ్యే నాయకత్వం

ప్రస్తుతం మల్కాజ్గిరి ఎంపీగా కొనసాగుతున్న ఈటల రాజేందర్, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్లమెంట్‌లో తెలంగాణ అంశాలను ప్రస్తావించడమే కాకుండా, నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల మెరుగుదల, కేంద్ర నిధుల సాధన కోసం కృషి చేస్తున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

### అధికారంలో ఉన్నా... ప్రతిపక్షంలో ఉన్నా ఒకే తీరు

ఈటల రాజేందర్ రాజకీయ జీవితాన్ని పరిశీలిస్తే అధికారంలో ఉన్నప్పటికీ, బయట ఉన్నప్పటికి ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించడమే ఆయన బలంగా కనిపిస్తుంది. కార్యకర్తలకు అందుబాటులో ఉండటం, ప్రజల సమస్యలను నేరుగా వినడం, రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొని నిలబడటం ఆయన వ్యక్తిత్వంలో భాగంగా మారాయి.

### తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయం

తెలంగాణ ఉద్యమం, మంత్రి పదవి, వివాదాలు, రాజకీయ పోరాటాలు, పార్టీ మార్పు, ఉప ఎన్నిక విజయం, ఎంపీగా ఎన్నిక — ఇలా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ వచ్చిన ఈటల రాజేందర్ ప్రస్థానం తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. పోరాటం నుంచి వచ్చిన నాయకుడిగా, ఆత్మగౌరవాన్ని రాజకీయ మూలధనంగా మలుచుకున్న నాయకుడిగా ఆయన పేరు తెలంగాణ రాజకీయ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోతుందని ఆయన అనుచరులు విశ్వసిస్తున్నారు.

### బీజేపీలో కీలక నాయకత్వం

భారతీయ జనతా పార్టీలో చేరిన తర్వాత తెలంగాణలో పార్టీ విస్తరణ కోసం ఈటల రాజేందర్ విస్తృతంగా పనిచేశారు. ఉద్యమ కాలంలో సంపాదించిన ప్రజా అనుబంధాన్ని బీజేపీ బలోపేతానికి ఉపయోగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణలో బీజేపీకి సామాజిక, రాజకీయంగా మరింత విస్తరణ కల్పించడంలో ఆయన పాత్ర ఉందని పార్టీ నాయకులు చెబుతున్నారు.

### టీఆర్ఎస్ నుంచి నిష్క్రమణ.. రాజకీయాల్లో కీలక మలుపు




టీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నించినందుకే తనపై ఆరోపణలు మోపి రాజకీయంగా లక్ష్యంగా చేసుకున్నారని అప్పట్లో ఈటల రాజేందర్, ఆయన అనుచరులు తీవ్రంగా ఆరోపించారు. భూవివాదాల ఆరోపణల నేపథ్యంలో మంత్రి పదవి కోల్పోయినా, అవి రాజకీయ కక్షసాధింపు చర్యలేనని ఆయన వర్గం వాదించింది. అధికారానికి తలవంచకుండా నిలబడినందుకే తనపై దాడి జరిగిందనే భావనను ఆయన అనుచరులు ప్రజల్లో బలంగా వినిపించారు. ఆ సమయంలో తెలంగాణ రాజకీయాల్లో ఈ వ్యవహారం పెద్ద చర్చకు దారి తీసింది. అధికార పార్టీని వదిలి బయటకు వచ్చిన తర్వాత కూడా ప్రజల మద్దతుతో నిలబడగలిగిన నాయకుడిగా ఈటల తన రాజకీయ బలాన్ని నిరూపించుకున్నారు.

---

### అయోధ్య చోరీ కేసులో
## దర్యాప్తు ముమ్మరం

- నిందితుల నుంచి రూ.70,25,000 నగదు సీజ్



**లక్నో,జూలై1(నినాదం):** అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో పోలీసులు నిందితుల ఇళ్ల నుంచి రూ.70,25,000 నగదును సీజ్ చేశారు. అత్యధిక శాతం నగదు నిందితుడు అవినాశ్ శుక్లా ఇంట్లో లభించింది.

▸▸తరువాయి2లో..

### ఔటర్ రింగ్ రోడ్డుపై
## కాల్పుల కలకలం



- పోలీసులపై మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ దాడి
- ఆత్మరక్షణ కోసం పోలీసుల కాల్పులు

2

## వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌కు బ్రేక్

- మెటాకు కేంద్రం నోటీసులు..
- వివరాలు ఇవ్వాలని ఆదేశం



**న్యూఢిల్లీ,జూలై1(నినాదం):**

వాట్సప్‌లోని యూజర్‌నేమ్ ఫీచర్ విషయంలో మెటాకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. 3 రోజుల్లో సమాధానం ఇవ్వాలని సూచించింది. అప్పటి వరకు భారత పౌరులకు యూజర్‌నేమ్ ఫీచర్ రోలఅవుట్‌ను ఆపాలని పేర్కొంది.

### ఆదాయ సమీకరణపై
# దృష్టి పెట్టండి

### రాబడి పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలి

- శాఖల వారీగా సామర్థ్యాన్ని పెంచుకోవాలి
- అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం




**హైదరాబాద్,జూలై1(నినాదం):**

ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలని అన్నారు. హెచ్ఎండిఏ,టిజిఐఐసి, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు. బుధవారం ఎమ్‌సీఆర్‌హెచఆర్‌డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.

వివరాలు 2

### ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు మరింత
## ఆలస్యం

- పెద్దగా ప్రభావం ఉండేలా కనిపించని పరిస్థితి
- వరి బదులు ఆరుతడి పంటలపై సిఎం రేవంత్ సూచనలు

## అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యం

- ట్రాఫిక్ తదితర సమస్యలపై చెక్ పెట్టే సాంకేతికత
- సిఎం రేవంత్‌తో భేటీ అయినా మేఘా కృష్ణారెడ్డి
- అన్‌లాగ్ సిఇవో అలెక్స్ కిప్‌మాన్

వివరాలు 2



### ప్రకాశం బ్యారేజ్ నుండి కృష్ణా జలాల నీటి విడుదల

- కృష్ణా డెల్టా రైతాంగానికి మేలు చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- 13.08 లక్షల ఎకరాల ఆయుకట్టు ద్వారా 30 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- జిల్లా కలెక్టర్ డా.జి లక్ష్మీశ

2

## రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగివున్న ట్రక్కును ఢీకొన్న బస్సు
- మంటలు చెలరేగడంతో ఏడుగురు సజీవ దహనం

**దౌసా,జూలై1(నినాదం):** రాజస్థాన్‌లో బుధవారం తెలవారుజామున ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. దౌసా జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు, నిలిపి ఉంచిన ట్రక్కును బలంగా ఢీకొట్టింది.



2

## ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యుల కీలక పాత్ర

**నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి**
**డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర**

**హైదరాబాద్,జూలై1(నినాదం):**

డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. తమ నైపుణ్యం ద్వారా ప్రతి రోజూ వేల ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు ఆరోగ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు.

## ఇజ్జత్ పోయేదానికి ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి

- తెలంగాణను పదేపదే కించ పరుస్తున్న రేవంత్
- కాళేశ్వరంపై ప్రపంచమంతా అభినందిస్తే...విమర్శలా
- కోటి ఎకరాల మాగాణంగా కెసిఆర్ తీర్చిదిద్దారు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై మేం చర్చకు సిద్ధమే
- తేదీ సమయం చెబితే రావడానికి రెడీగా ఉన్నాం
- మీడియా సమావేశంలో రేవంత్‌కు కెటిఆర్ సవాల్

వివరాలు 2



# ఆయిల్ పామ్ సాగు వైపు రైతులు అడుగులు వేయాలి

**ప్రభుత్వ విప్ సిచ్ విజయరమణారావు**

**ఆయిల్ పామ్ సాగుతో ఎకరాకు రూ.3 లక్షల వరకు ఆదాయం సాధ్యం**

**సూపర్ ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి**

**చిన్న,సన్నకారు రైతులకు అన్ని విధాలా అండగా జిల్లా యంత్రాంగం**

**ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, కలెక్టర్**





**పెద్దపల్లి రూరల్,జూలై1(నినాదం):** ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందనీ, ప్రతి రైతు ఆయిల్‌పామ్ సాగు వైపు అడుగులు వేయాలని, ప్రభుత్వ విప్ సిచ్ విజయ రమణారావు అన్నారు. బుధవారం ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ తో కలిసి ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, తన 60 సం,రాల జీవితంలో ఈ ప్రాంతం నీటి కోసం పడిన ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశానని, ఎస్ఆర్ఎస్పీ డి-83, డి-86 కాలువల రాకతో ఈ ప్రాంత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యధికంగా 1.20 నుంచి 1.30 లక్షల ఎకరాల ఆయకట్టు పెద్దపల్లి నియోజకవర్గంలోనే ఉందన్నారు. డి-86 కింద 87 వేల ఎకరాలు,డి-83 కింద 35 వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో వరి, మొక్క జొన్న దిగుబడులు అధికంగా వస్తున్నాయని, ఈ సీజన్‌లో 2.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం,27 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే చెల్లింపులు అందుతు న్నాయని పేర్కొన్నారు. వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించిన ఆయన,యూరియా బుకింగ్ యాప్‌ను తొలిసారిగా పెద్దపల్లి జిల్లాలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రవేశపెట్టారని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయగా,ప్రస్తుతం దేశవ్యాప్తంగా కూడా ఇదే తరహా విధానాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అధికంగా యూరియా వినియోగించడం వల్ల భూమి సారవంతత తగ్గి భవిష్యత్తులో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులు గుర్తించాలని సూచించారు. రైతులు వరి సాగుతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని,తెలంగాణ రాష్ట్రం ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రభుత్వం తక్కువ ధరకు మొక్కలు అందజేస్తోందని,నాలుగేళ్ల తర్వాత ఎకరాకు సుమారు రూ. 3 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆ నాలుగేళ్లలో అంతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తూ ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో పండే పంటల సాగుపై దృష్టి పెట్టాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,శివపల్లి గ్రామంలో ఒకేసారి 120 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. దీనిని చూసి మరింత మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు ఆకర్షితులవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోందని, శ్రీరాంపూర్ మండలంలో కొత్త ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అవుతోందన్నారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ ధర టన్నుకు రూ. 23 వేల వరకు పెరగడంతో రైతులకు మరింత ఆదాయం లభించే అవకాశం ఉందని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, ఒంటరి మహిళా రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపడితే మొక్కల నాటకం, డ్రిప్ ఏర్పాటు వంటి అంశాల్లో జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అవసరమైతే బోర్లు, విద్యుత్ కనెక్షన్లు కూడా కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మరో 50 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరిస్తే కొత్త రహదారి మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, శ్రీరాంపూర్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఎండీ. శ్యామ్,ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ -XII నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం

**శాఖల మధ్య సమన్వయంతో చిన్నారుల రక్షణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి**

**జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్**




**నిర్మల్ ప్రతినిధి, జూలై 1 (నినాదం):** జూలై నెల పొడవునా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్-XII విజయవంతమైన అమలుపై నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఆపరేషన్ ముస్కాన్-XII ప్రధాన లక్ష్యం అదృశ్యమైన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు సురక్షితంగా చేర్చడం, బాల కార్మికత్వం, బాల భిక్షాటనం, మానవ అక్రమ రవాణా మరియు ఇతర దోపిడీ లేదా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించడం, వారికి చట్టపరమైన రక్షణ, వైద్య సేవలు, కౌన్సెలింగ్, పునరావాసం కల్పించి వారి భవిష్యత్తును భద్రపరచడం అని తెలిపారు. ఆపరేషన్ విజయవంతంగా అమలు కావాలంటే స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్ (SJPU), జిల్లా బాలల పరిరక్షణ అధికారి (DCPO), చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (CWC), మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థలు (NGOs) తదితర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చిన్నారులను గుర్తించడం నుంచి వారి పునరావాసం, కుటుంబా లతో సురక్షితంగా పునరేకీకరణ వంకు అన్ని శాఖలు సమిష్టిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరిశ్రమలు, హోటళ్లు, ధాబాలు, గ్యారేజీలు, వర్క్‌షాపులు, నిర్మాణ ప్రాంతాలు, ఇటుక బట్టీలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్ ప్రాంతాలు తదితర చోట్ల ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, బాల కార్మికత్వం, బాల భిక్షాటనం లేదా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులు గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని వారికి అవసరమైన సంరక్షణ, పునరావాసం కల్పించాలని అధికా రులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించి, ఆపరేష న్ ముస్కాన్-XIIను సమన్వయంతో విజయవంతం చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్, జిల్లా అదనపు పోలీసు అధికారి డి. ఉపేందర్ రెడ్డి, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్ (SJPU) ప్రతినిధులు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి (DCPO), చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (CWC) సభ్యులు అనిల్, శ్రీలత, జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, జిల్లా కార్మిక అధికారి రాజలింగం, ముస్కాన్ జిల్లా ఇంచార్జీ ఎస్ఐ అజయ్, సబ్ డివిజన్ ఇంచార్జీ డబ్ల్యుఎస్ఐ శ్రావణి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖతో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్ జీ పథకం లక్ష్యాలను సకాలంలో సాధించాలి

**వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులను చేపట్టాలి**

**కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**



**వనపర్తి ప్రతినిధి, జూలై1 (నినాదం) :** వీబీజీ రామ్ జీ(ఎంజిఎన్ఆర్ఈజిఎస్) పథకం కింద నిర్వహించే పనుల్ని సకాలంలో పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించా లని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీబీజీ రామ్ జీ, ఎన్ఎఫ్‌బీఎస్, ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షా కాలం ప్రారంభమైన నేపథ్యంలో అన్ని గ్రామాలు, పట్టణా ల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేప ట్టాలని ఆదేశించారు. డ్రైనేజీల శుభ్రపరచడం, డీ-సిల్టింగ్, చెత్త తొలగింపు పనులను నిరంతరం నిర్వహించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా అనుమానిత కేసులు గుర్తించిన వెంటనే వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఎన్ఎఫ్‌బీఎస్ (జాతీయ కుటుంబ ప్రయోజన పథకం) కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించి దరఖాస్తులను వేగంగా పరిశీలించి త్వరితగతిన ప్రయోజనం కల్పించాలని ఆదేశించారు. మునిసిపాలిటీలలో ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని, డెత్ రిజిస్టర్ తీసుకొని లబ్ధిదారుల గుర్తింపు, వారికి ఎన్ఎఫ్‌బీఎస్ లబ్ధి వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమంలో పొడవైన మొక్కలకు ప్రాధాన్యత ఇస్తూ వెంటనే నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని తెలిపారు. వీబీజీ రామ్ జీ కింద గ్రామాల అభివృద్ధికి దోహదపడే రహదారుల నిర్మాణ పనులను చేపట్టాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, వంటి నీటి సంరక్షణ పనులను మరింత విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బీవీజీ రామ్ జీ కింద అన్ని గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబెర్స్ కు ఇంకుడు గుంతల నిర్మాణం కోసం శాంక్షన్ ఇవ్వాలన్నారు. బీవీజీ రామ్ జీ(ఎంజిఎన్ఆర్ఈజిఎస్) పథకం కింద నిర్వహించే పనుల్ని సకాలంలో పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో అర్హులను పక్కాగా గుర్తించాలన్నా రు. గుడిసెల్లో నివసించే వారికే ప్రథమ ప్రాధాన్యత కింద ఇల్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాంటి వారిని గుర్తించి తమ లాగిన్ కు పంపాలని సూచించారు. జిల్లాలో చేపడుతున్న అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈఓ యాదయ్య, డి ఆర్ డి ఓ ఉమాదేవి, డిప్యూటీ సీఈఓ రామ మహేశ్వర్, ఎంపీడీఓ లు, మునిసిపల్ కమీషనర్ లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఎన్యూమరేషన్ ఫారాలను సమగ్రంగా పూరించి బిఎల్ఓ లకు తిరిగి ఇవ్వాలి

**ఎన్యూమరేషన్ ఫారం నింపి ఇవ్వని వారి పేర్లు కొత్త ఓటర్ జాబితాలో ఉండవు**

**రెవెన్యూ డివిజనల్ అధికారి డి.సుబ్రమణ్యం**



**వనపర్తి ప్రతినిధి, జులై1 (నినాదం) :** స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ ప్రక్రియలో భాగంగా బిఎల్వోలు ఇప్పటికే ఇంటింటికి తిరిగి ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారం లను 2002 ఓటరు జాబితాలోని వివరాల ఆధారంగా పూరించి ప్రస్తుత ఫోటో అతికించి తిరిగి బిఎల్ఓ లకు ఇవ్వాలని వనపర్తి రెవెన్యూ డివిజనల్ అధికారి సుబ్రమణ్యం కోరారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇప్పటివరకు ఓటరుగా ఉండి గత ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు సైతం బిఎల్ఓ లు ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫారం ను నింపి ఇవ్వాల్సి ఉంటుందని, లేనిపక్షంలో కొత్తగా ఏర్పాటు చేసే ఓటరు జాబితాలో పేరు నమోదు చేయబడదని తెలియజేశారు. బి ఎల్ వో ల ద్వారా ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారం ను జాగ్రత్తగా పరిశీలించి 2002 లో ఓటర్లు అయి ఉంటే వారంలో 1,3వ భాగాలను పూరించి లేటెస్ట్ ఫోటో అతికించి ఫారంపై సంతకం చేసి ఒక కాపీ బీఎల్ఓ లోకి ఇచ్చి మరో కాపీని బిఎల్ఓ వద్ద రిసిప్ట్ గా రాయించుకుని వద్ద ఉంచుకోవాలని కోరారు. ఏనుమరేషన్ ఫారం ను నింపడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే బిఎల్ఓ లను అడిగి వారి సూచనల మేరకు ఫారం నింపుకోవాలని తెలిపారు. వనపర్తి జిల్లాలో 275570 ఓటర్లు ఉండగా ఈరోజు వరకు 236, 060 ఏనుమరేషన్ ఫారాలను బి ఎల్ వో ల ద్వారా ఇంటింటికి తిరిగి పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన ఫారాలను సైతం గురువారం లోగా 100% పంపిణీ పూర్తి చేస్తామని చెప్పారు. ఫారం నింపడంలో బిఎల్ఓ లకు పూర్తి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎనుమరేషన్ ఫారాలు తిరిగి ఇచ్చిన వాటిని పరిశీలించి జులై 31 నాటికి ముసాయిదా ఓటరు జాబితా సిద్ధం చేసి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉంచడం జరుగుతుందన్నారు. ఓటర్లందరూ విధిగా ఓటర్ జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకొని ఒకవేళ పేరు లేకుంటే ఆర్డీఓ అప్పీల్ చేసుకొని జాబితాలో పేరు నమోదు అయ్యే విధంగా చూసుకోవాలన్నారు. అక్టోబర్ ఒకటో తేదీ 2026 నాడు తుది ఓటరు జాబితా ప్రకటించడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి అవుతున్న యువతీ, యువకులు సైతం ఫారం 6 ను పూరించి బిఎల్ఓ లకు జూన్ 24 లోపు అందించాలని సూచించారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు ఏమైనా మార్పు చేర్పులు చేయాలనుకుంటే ఫారం 8 నింపి మార్పు చేర్పులు చేసుకోవచ్చని ఆయన అన్నారు

# శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యం

**అనుమతి లేని సభలు ర్యాలీలపై కఠిన చర్యలు.. ఎస్పీ డి.సునీత రెడ్డి**



**వనపర్తి ప్రతినిధి, జులై1 (నినాదం) :** శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యమని, అనుమతిలేని సభలు, ర్యాలీలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డి అన్నారు. జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టంగా కొనసాగించడం, ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చూడడం, అవాంఛనీయ సంఘటనలను ముందస్తుగా నివారించడం లక్ష్యంగా జులై 1 నుంచి జులై 31 వరకు "30 పోలీస్ యాక్ట్-1861" అమల్లో ఉంటుందని ఎస్పీ సునిత రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ జిల్లా పరిధిలో ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశమున్న ఎలాంటి కార్యక్రమమైనా సంబంధిత పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, నిరసన కార్యక్రమాలు, భారీ స్థాయి సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను పోలీసులు ఏమాత్రం ఉపేక్షించబోరని, "30 పోలీస్ యాక్ట్" నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించా రు. ప్రజల భద్రత, ప్రశాంతత, సామాజిక శాంతిని పరిరక్షించడమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఏ సంస్థ, సంఘం లేదా వ్యక్తి బహిరంగ కార్యక్రమాలు నిర్వ హించదలచినట్లయితే సంబంధిత పోలీసు అధికారులను ముందుగానే సంప్ర దించి అనుమతి పొందాలని సూచించారు. చట్టాలను గౌరవించడం ప్రతి పౌరుని బాధ్యత అని,ప్రజల సహకారంతోనే జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని మరింత బలోపేతం చేయగలమని ఎస్పీ తెలిపారు. ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# రాయితీలను ప్రజలు వినియోగించుకోవాలి: ఎమ్మెల్యే

**బ్యాటరీ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**





**అమీన్‌పూర్, జూలై1 (నినాదం):** పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వం బ్యాటరీ వాహనాల కొనుగోలుకు అందిస్తున్న రాయితీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని కృష్ణారెడ్డి పేట, ఇక్రిశాట్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాటరీ స్కూటర్ విక్రయ కేంద్రం, పులావ్ హట్ భోజనశాలను అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు బ్యాటరీ వాహనాల వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. నూతనంగా ప్రారంభమైన బ్యాటరీ స్కూటర్ విక్రయ కేంద్రం ప్రజల విశ్వాసాన్ని పొందుతూ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అలాగే పులావ్ హట్ భోజనశాల నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ ఉపాధ్యక్షుడు నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ ప్రాంతంలో ఇటువంటి ఆధునిక వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం సంతోషకరమని అన్నారు. ఈ కార్య క్రమంలో మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు దేవానందం, మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు సుధాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొల్లూరి చంద్రకళ గోపాల్, నందారం రమేష్ గౌడ్, ఐలాపూర్ నర్సింగ్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, కాలనీవాసులు పాల్గొన్నారు. అవసరమైతే దీనిని మరింత ఆకర్షణీయమైన పత్రికా ప్రకటన శైలిలో లేదా వార్తా ఛానల్ స్క్రిప్ట్ శైలిలో కూడా సిద్ధం చేసి ఇవ్వగలను.

## డోర్పల్లి గ్రామ పోడు రైతుల సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ కృషి



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 01(నినాదం) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం డోర్పల్లి గ్రామ పోడు భూముల సమస్యను పరిష్కరించి పోడు రైతులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ నాయకురాలు,ఆంధ్రప్రదేశ్-అండమాన్ నికోబార్ రాష్ట్రాల ఇన్‌చార్జి, ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి బి. ఆదిత కోరారు పోడు రైతుల విజ్ఞప్తిపై స్పందించిన ఆమె సిర్పూర్(టి) అటవీశాఖ కార్యాలయానికి చేరుకుని ఎఫ్ఆర్ఓ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఫారెస్ట్ మినిస్టర్ కొండ సురేఖ దృష్టికి తీసుకెళ్లి పోడు రైతుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఫారెస్ట్ అధికారులు రైతుల సమస్యలను, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన ఎఫ్ఆర్ఓ సమస్యను పరిశీలించి నిబంధనల మేరకు సమస్యని పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు వారి వెంట జిల్లా మైనార్టీ చైర్మన్ అర్షద్ హుస్సేన్, కుమ్మరి లింగయ్య మాజీ సర్పంచ్ ఉన్నారు.

# ఎమ్మెల్యేకు సమాచారం లేకుండానే అభివృద్ధి పనులు ప్రారంభం

**అధికారులపై ఆగ్రహించిన ఎమ్మెల్యే,**

**తీరు మార్చుకోవాలని అధికారులకు సూచన.**

**ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి**



**కొల్చారం, జూలై 1( నినాదం ):** మండల కేంద్రమైన కొల్చారంలో తపాల శాఖ ప్రారంభోత్సవానికి అధికారిక సమాచారం ఇవ్వరా అని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులకు తాను సహకరిస్తున్న పలు శంకుస్థాపనలకు కనీసం సమాచారం ఇవ్వరా అని అధికారులపై మాజీ మంత్రి నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీతా లక్ష్మారెడ్డి మండి పడ్డారు. స్థానిక ఎమ్మెల్యే ఉన్న తనకు సమాచారం ఇవ్వకుండా అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా కాదా అని ప్రశ్నించారు. మంజూరి కోసం సంబంధిత అధికారులకు మండల కేంద్రం కొల్చారంలో తదితర గ్రామాల సౌకర్యార్థం కోసమని 2024లో ప్రతిపాదనలు పంపిన తనకు సమాచారం ఇవ్వకపోవడం ఏంటని అధికారులను నిలదీశారు. పద్ధతి మార్చుకోవాలని హెడ్ పోస్ట్ ఆఫీస్ సూపర్ అండి ఎందుకు సూచించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఎమ్మెల్యే వెంట బి. ఆర్. ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీ శంకర్ గుప్తా, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పైతర సర్పంచ్ రవితేజ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, కరెంట్ రాజా గౌడ్, ఉప సర్పంచ్ కొరంపల్లి రాణి గోపి, దుర్గ ప్రసాద్ గౌడ్ , ఎల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

# పశువుల సంతను ప్రారంభించిన కలెక్టర్ ప్రియాంక

**15 ఏళ్ళ అనంతరం పునః ప్రారంభమైన సంత**

**అధిక సంఖ్యలో పాల్గొన్న క్రయ,విక్రయ దారులు**



**నారాయణపేట ప్రతినిధి, జులై 1, (నినాదం):** గత 15 ఏళ్లుగా పశువుల సంతలో క్రయ, విక్రయాలు బంద్ కావడంతో ఎన్నో వ్యాయా,ప్రాయాసాలు పడ్డ ఈ ప్రాంత రైతులు, వ్యాపారులకు ఊరట లభించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంత వాసులకు తీపికబురందించి, బుధవారం నాడు గొప్పగా పశువుల సంతను పునః ప్రారంభించడం తో క్రయవిక్రయాలు జోరందు కున్నాయి. ఇట్టి పశువుల సంతను జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పునః ప్రారంభించేందుకై ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక హాజరయ్యారు. మార్కెట్ చైర్మన్ ఆర్. సదాశివరెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ కొండ శ్వేత, వైస్ చైర్మన్ మంజుల, తో కలిసి ప్రారంభించారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ పాలకవర్గ సభ్యులతో కలక్టర్ సమావేశం అయ్యారు. పాలకవర్గం అధికారులు ఈ నామ్ ను సమర్ధవంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. అనంతరం సంత బజారుకు చేరుకున్న మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా బందున్న పశువుల సంతను ప్రారంభించడం సంతోషదాయక మని వ్యవసాయ మార్కెట్ కు ఇది రెండవ ఆదాయ వనరుగా ఏర్పడిందని అన్నారు. రాబోయే రోజుల్లో ఇక్కడికి పశువులను తీసుకువచ్చే రైతులకు ఎలాంటి సమస్యలు ఉండకుండా ఉండేందుకై షెడ్లు, మంచినీరు లాంటి కావలసిన వసతులు ఏర్పాటు చేస్తామని అన్నారు. మొట్టమొదటగా సెంటిమెంట్ ప్రకారం అమ్మకాలు ఆవు తో ప్రారంభించారు. అమ్మిపురం గ్రామానికి చెందిన రైతు వెంకట్ రెడ్డి తను అమ్మకానికి తీసుకొచ్చిన ఆవు ఇట్టి వేలంలో 22 వేల రూ,, పలకగా అట్టి ఆవును పట్టణానికి చెందిన మల్లేష్ అనే రైతు వేలంలో పాల్గొని కొనుగోలు చేశారు. అనంతరం ఒక గేదెను మరో రైతు 30 వేలకు విక్రయించగా పట్టణానికి చెందిన ఓ వ్యాపారి కొనుగోలు చేశారు. ఇదే కోవలో మేకలు, గొర్రెలు కూడా విక్రయానికి తీసుకొచ్చారు. రైతులు, వ్యాపారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి ఈ ప్రాంతంలో సంత బజారు బంద్ కావడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఆ పరిస్థితి ఇకపై ఉండబోదని, ఇట్టి సంత బజారును పునః ప్రారంభించడంతో హర్షం వ్యక్తం చేశారు. ఇట్టి కార్యక్రమంలో చైర్మన్ సదాశివరెడ్డి తో పాటు మాధవ రెడ్డి, వైస్ చైర్మన్ కోనంగేరి హనుమంతు, పోషల్ రాజేష్, శరణప్ప, ఈదెప్ప, బాలప్ప, అమ్మకం దారులు, కొనుగోలు రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

# ఉపాధి లక్ష్యం మారితేనే గ్రామాలకు మహర్దశ !

సంపాదకీయం

ఉపాధి హామీ పథకం పేరు మారింది. నింబంధనలు మార్చిన కేంద్రం ప్రభుత్వం వీబీజీరామ్‌జీ అంటే వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తీసుకుని వచ్చింది. పథకం పేరు మారినా పెద్దగా మారిందేమీ ఉండకపోవచ్చు. ఇందులో గతంలో కేంద్రం 90శాతం నిధులు, రాష్ట్రాలు పదిశాతం నిధులు భరించేవి. కానీ ఇప్పుడు కేంద్రం 60శాతం, రాష్ట్రాలు 40శాతం నిధులు భరించేలా మార్పులు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి ఉపాధి కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2006లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టింది. కూలీలకు ఉపాధి కల్పించే పథకంగా పేరు సంతరించుకున్న ఉపాధి హామీపథకం ఇక వీబీజీరామ్‌జీ పేరుతో జులై1 నుంచి అమలు చేయనున్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను సమకూర్చేవి. వీబీజీరామ్‌జీకి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించనున్నాయి. ఈలెక్కన రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం అదనంగా నిధులు భరించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకం అమలుతో వలసలు తగ్గడంతో పాటు,గ్రామీణప్రాంత ప్రజలకు ఎంతోకొంత ప్రయోజన కరంగా మారింది. వీబీజీరామ్‌జీతో ఉపాధి కూలీలకు మేలు చేకూరనుంది. పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచారు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే, వేలకోట్లు ఖర్చు చేసినా గ్రామాల్లో పెద్దగా మార్పులు కానరాలేదు. ఈ పథకం పేరు మార్చిన పెద్దలు విధానలను పట్టించుకున్నట్లుగా లేదు. గ్రామాల్లో ఇప్పుడు వ్యవసాయ కూలీల కొరవ ఉంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు వెనక్కి పోయాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. చెరువులు కుంటలు మాయం అవుతున్నాయి. పచ్చదనం పగటికలగా మారింది. పర్యావరణ విధ్వంసం యధావిధిగా సాగుతోంది. చెరువుల పునరుద్దరణ సాగాలి. నాలాల పూడికతీతలు చేయాలి. వాననీటి సంరక్షణ పథకాలు చేపట్టాలి. ఈ క్రమంలో వీటన్నింటిని ఇందులో చేర్చి పక్కాగా కొత్త పథకం ద్వారా దేశ నిర్మాణం చేయగల గాలి. అప్పుడే వెచ్చించిన డబ్బులకు ప్రతిఫలం దక్కుతుంది. కేవలం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఏదో ఒక పనిచేయించామన్న రీతిలో పథకం సాగరాదు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు వేతనాలు ఆలస్యమయ్యేవి. ఒక్కోసారి నెలలు గడిచినా డబ్బులు జమయ్యేవి కావు. నూతన పథకంలో వేతనాలు ఆలస్యమైతే కూలీలకు పరిహారం చెల్లించనున్నారు. పనిచేసిన తరువాత 15 రోజుల్లో కూలీల బ్యాంకు ఖాతాల్లో వేతనం జమ చేయనున్నారు. ఆలస్యమైతే పరిహారం ఇవ్వనున్నారు. గతంలో కాకుండా ప్రతి కుటుంబానికి 125 రోజులు పని దినాలు కల్పించనున్నారు. వీబీజీరామ్‌జీ పథకాన్ని మీడుగా విభజించారు. పనుల్లో పారదర్శకత పెంచడడంతోపాటు అరు నెలలకోసారి సామాజిక తనిఖీలు చేయనున్నారు. వేతనాల చెల్లింపు వివరాలను బహిరంగంగా వెల్లడించ నున్నారు. ఫిర్యాదుల స్వీకరణకు సరికొత్త వ్యవస్థలను వినియోగంలోకి తీసుకురానున్నారు. కొత్త పథకంపై తెలంగాణ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇటీవల కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో జరిగిన భేటీలో మంత్రి సీతక్క తమ అభ్యంతరాలను తెలియచేసింది. కేంద్రం కూడా రాష్ట్రాల అభ్యంతరాలతో పాటు, పనుల నిర్వహణపై సూచనలు సలహాలు తీసుకుని ఉంటే బాగుంటుంది. ఎందుకంటే చేపట్టే పనులు గ్రామాల ఆర్థిక పరిస్థితిని మార్చగలిగేలా ఉండాలి. గ్రామాల్లో చెరువుల పూడికతీత, భవనాల నిర్మాణం, కాలువల నిర్మాణం, మొక్కల పెంపకం, కొతుల నిర్మూలన వంటి పనులన్నీ ఇందులోకి తీసుకుని రాగలిగితే మంచిది. ఇకపోతే వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ కొత్త ఉపాధి పథకంలో అయినా ఈ సమస్యకు పరిష్కారం చూపగలగాలి. ఎల్‌నినో ప్రభావంతో ఈ యేడు వర్షాలు అంతంతమాత్రంగానే ఉండ నున్నాయి. ఈసారి అనేక ప్రాంతాల్లో నైరుతి వర్షించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై తీవ్ర ప్రభావం ఉండబోతోంది. దీంతో దేశవ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్యమవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో ఉపాధి పనులతో సమస్యలను ఎదుర్కొనేందుకు ఎదురీదాలి. గ్రామాల్లో నీటి వనరులను పెంచే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. మొక్కలను పెంచాలి. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనికి విరుగుడుగా ప్రధానంగా భూగర్భ జాలాలను పెంచుకోవాలి. వాననీటిని ఒడిసిపట్టాలి. ఈ పనులకు అవసరమయ్యే కూలీలను ఉపాధి పథకం ద్వారా భర్తీ చేయగలగాలి. అప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మార్గం చూపినవారం అవుతాం.

# కనుమరుగవుతున్న కులవృత్తులు

## అంతరించే నైపుణ్యం... ఆగమయ్యే ఆత్మగౌరవం

మంగలి అంగళ్లు ఇప్పుడు 'యునిసెక్స్ సెలూన్' అయ్యాయి. కుమ్మరి వీధిలో ఇప్పుడు ప్లాస్టిక్ బిందెలు వేలాడుతున్నాయి. చాకలి బండ దగ్గర ఇప్పుడు వాషింగ్ మెషీన్ శబ్దం. అభివృద్ధి పేరుతో మనం ఒక తరం నైపుణ్యాన్ని, ఒక జాతి జ్ఞాపకాన్ని సమాధి చేస్తున్నాం. కులవృత్తులు కనుమరుగు కావడం అంటే కొన్ని పనులు ఆగిపోవడం కాదు, తెలంగాణ సామాజిక DNAలోని ఒక క్రోమోజోమ్‌ను తొలగించడం.

కులవృత్తి అంటే 'కులం' కాదు, ఓ 'కళ'

మనం అపోహలో ఉన్నాం. కులవృత్తి అంటే వివక్ష కాదు. అది 'వంశపారంపర్య నైపుణ్య బదిలీ వ్యవస్థ'. IITలో నేర్పని ఇంజనీరింగ్‌ను వడ్రంగి తన కొడుకుకు నేర్పాడు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేయకుండానే సాలెవాడు చీరకు ప్రాణం పోశాడు. మెడికల్ కాలేజీ మెట్లు ఎక్కకుండానే కాటికాపరి, నాటు వైద్యుడు బతుకుల్ని నిలబెట్టారు. ఈ వృత్తులు గ్రామానికి 'సెల్ఫ్ సస్టెయిన్డ్ ఎకానమీ'ని ఇచ్చాయి. కుమ్మరి కుండ ఇస్తే, రైతు ధాన్యం ఇచ్చాడు. మంగలి క్షవరం చేస్తే, యజమాని వడ్లు ఇచ్చాడు. డబ్బు అవసరం లేని 'వస్తు మార్పిడి' వ్యవస్థ. ఇది కేవలం ఎకానమీ కాదు, ఎకాలజీ. సమాజం ఒక కుటుంబంలా బతికింది.

ఎందుకు కనుమరుగవుతున్నాయి?

యంత్రం దెబ్బ – మనిషి విలువ మంటగలిసింది. పవర్‌లూమ్ వచ్చాక చేనేత చచ్చిపోయింది. జేసీబీ వచ్చాక పార పట్టేవాడి పని పోయింది. ఆర్ ఓ వాటర్ ప్లాంట్ వచ్చాక కుండకు గిరాకీ లేదు. యంత్రం 100 మంది పని ఒక్కరోజులో చేస్తుంది. కానీ ఆ 100 కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

'చిన్న పని' అనే చిన్నచూపు మన చదువులు పిల్లలకు 'వైట్ కాలర్ జాబ్' కలలు నేర్పాయి. కానీ 'స్కిల్ ఈజ్ రెస్పెక్ట్' అని నేర్పలేదు. కుమ్మరి కొడుకు కుమ్మరి అవ్వాలంటే సిగ్గుపడుతున్నాడు. కటిక వాడి బిడ్డ ఇంగ్లీష్ మీడియం చదివి సిటీకి వలసపోతున్నాడు. వృత్తిని కాదు, వారసత్వాన్ని వదిలేస్తున్నాం.

ప్రభుత్వాల 'పథకాల' మాయ. చేనేతకు సబ్సిడీ ఇస్తారు, కానీ మార్కెటింగ్ ఉండదు. కుమ్మరికి ఉచిత మట్టి ఇస్తారు, కానీ కుండ కొనేవాడు ఉండదు. విశ్వకర్మ యోజన వచ్చింది, కానీ ట్రైనింగ్ ఇచ్చి వదిలేస్తున్నారు. 'బతుకుతెరువు' ఇవ్వకుండా 'బతిమాలుకునే' పథకాలు ఇస్తున్నారు.

కోల్పోతున్నది ఏంటి? – నష్టం కేవలం ఆర్థికం కాదు

నైపుణ్య వారసత్వం. పోచంపల్లి ఇకత్ డిజైన్, నిర్మల్ పెయింటింగ్, పెంబర్తి ఇత్తడి పని – ఇవన్నీ పుస్తకాల్లో దొరకవు. తాత నుంచి మనవడికి వేళ్ల ద్వారా పాకే కళలు. ఈ తరం నేర్చుకోకపోతే, అవి మ్యూజియంలో శవాలు అవుతాయి.

పర్యావరణ హననం, కుమ్మరి కుండ భూమిలో కలిసిపోతుంది. ప్లాస్టిక్ బిందె 500 ఏళ్లు కుళ్లదు. చాకలి వాడే చౌడు, కుంకుడు కాయ నీటిని కలుషితం చేయవు. సర్ఫ్ ఎక్సెల్ చేస్తుంది. కులవృత్తులు పోయి 'పర్యావరణ విధ్వంసం' మిగిలింది.

సామాజిక విచ్ఛిన్నం. ఓకప్పుడు గ్రామంలో 18 వృత్తుల వాళ్లు ఉంటే, అది ఒక పరిపూర్ణ సమాజం. ఇప్పుడు అందరూ రైతు లేదా కూలీ. వైవిధ్యం లేని సమాజం, అడవి లేని భూమి లాంటిది. ఏ కష్టం వచ్చినా కూలిపోతుంది.

పరిష్కారం – 'పాత' వృత్తికి 'కొత్త' ఊపిరి

సానుభూతి కాదు, వ్యూహం కావాలి.

స్కిల్ టు స్కేల్': కుమ్మరి కుండలు చేయడం కాదు, 'టెర్రకోట వాటర్ ఫిల్టర్లు', 'డిజైనర్ డిన్నర్ సెట్స్' చేయించాలి. మంగలిని 'హెయిర్ స్టైలిస్ట్'గా, చాకలిని 'ఎకో–ఫ్రెండ్లీ లాండ్రీ ఓనర్'గా మార్చాలి. వృత్తి అదే, ఉత్పత్తి మారాలి. అమెజాన్ ఫ్లిప్ కార్ట్, వీరి ప్రొడక్ట్స్‌కు ప్రత్యేక సెక్షన్ ఉండాలి.

'జియో ట్యాగింగ్' తో జీఐ ట్యాగ్: ప్రతి వృత్తికి, ప్రతి ఉత్పత్తికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్. 'పోచంపల్లి' మాస్కోలో అమ్మడైతే, పోచంపల్లి నేత బతకాలి. దళారులు కాదు.

పాఠశాలలో 'పని' పాఠం: 6వ తరగతి నుంచే 'వృత్తి విద్య' పాఠ్యాంశం పెట్టాలి. ఐఐటి ఫౌండేషన్ ఎంత ముఖ్యమో, కుండ చేయడం, నేత నేయడం నేర్పడం అంతే ముఖ్యం. 'శ్రమకు గౌరవం' అనేది పుస్తకంలో కాదు, ప్రాక్టికల్‌గా నేర్పాలి.


పర్యాటకంతో అనుసంధానం: 'కులవృత్తి గ్రామాలు'గా కొన్ని ఊళ్లను తీర్చిదిద్దాలి. టూరిస్ట్ వచ్చి, కుండ ఎలా చేస్తారో చూసి, తానూ ఒకటి చేసి, కొనుక్కుని వెళ్లాలి. 'అనుభవం' అమ్మితే, వృత్తి బతుకుతుంది.

జర్మనీ, జపాన్ లాంటి దేశాలు తమ 'వంశపారంపర్య నైపుణ్యాన్ని' కాపాడుకుని ప్రపంచానికి అమ్ముకుంటున్నాయి. మనం మాత్రం 'పాత చింతకాయ పచ్చడి' అని వదిలేస్తున్నాం. కులవృత్తులు అంతరించిపోతే, మనం కోల్పోయేది కొన్ని పనులు కాదు, 'మనం ఎవరు' అనే గుర్తింపును. ప్రభుత్వాలు మేల్కొనాలి. లేకపోతే రేపటి తరానికి గూగుల్‌లో 'కుమ్మరి అంటే ఏంటి?' అని వెతకాల్సిన దుస్థితి వస్తుంది.

అభివృద్ధి అంటే ఫ్లైఓవర్లు కాదు, వేళ్లలో ఉన్న కళను ఫ్లై చేయించడం. అది గుర్తుంచుకుంటేనే తెలంగాణకు నిజమైన 'బంగారు' భవిష్యత్తు.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**

# చరబండ రాజు: ప్రజల గళంగా వెలిసిన విప్లవ కవిత్వం



**జూలై 2...చరబండ రాజు వర్ధంతి**

చరబండ రాజు (అసలు పేరు బండి రాజేశ్వర రావు; జననం: 1944, మగ్దూంపూర్ గ్రామం, షాద్‌నగర్ సమీపం, మహబూబ్‌నగర్ జిల్లా; మరణం: జూలై 2, 1982) తెలుగు సాహిత్యంలో ఉద్యమ ప్రేరణగా నిలిచిన ఓ అరుదైన స్ఫూర్తి. సామాజిక అర్ధ రాత్రులలో వెలుగైనవాడు. ఆయన కవిత్వం అణచివేతకు వ్యతిరేకంగా ఒక తీవ్ర గళంగా మారింది. తాను చూసిన దురదృష్టాల్ని అక్షరాల్లోకి నింపి, ప్రజల జీవన యథార్థాన్ని పద్యంలోకి మలచిన మహోన్నత రచయిత.

చిన్ననాటి నుంచే సామాజిక అసమానతలను ఎదుర్కొన్న రాజు, జీవన పోరాటమే పాఠశాలగా స్వీకరించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు ప్రతికూలమైనప్పటికీ, చదువు మీద ఆయన ఆసక్తి తగ్గలేదు. పైగా అది జీవితాన్ని అర్థం చేసుకునే సాధనగా మారింది. అణగారిన వర్గాల బాధ, శోషితుల ఆక్రోశం, పీడితుల పీడలను ఆయన స్వానుభూతిగా పొందిన వాడు. ఈ వేదనలే ఆయనలో విప్లవ భావజాలానికి విత్తనాలు చల్లి, కలాన్ని కత్తిలా మారుస్తాయి.

విద్యార్థి దశ నుంచే వామపక్ష సిద్ధాంతాలు, మార్క్సిజం, అంబేద్కర్ ఆలోచనలు ఆయనను ఆకర్షించాయి. సమాజంలో ప్రతిష్ఠితమైన ధనవంతుల గొప్పదనాన్ని ప్రశ్నించే ధైర్యం ఆయనలో నాటివేసింది. ప్రజల జీవనసత్యాలను, వారి అభాగ్యాలను, ఆవేదనల్ని ఆయన పదాల్లో ప్రతిబింబించారు. రచనల ద్వారా కేవలం భావోద్వేగాన్ని కాక, ఉద్యమ శక్తిని, ప్రేరణను నూరిపోసిన వాడు.

రాజు రచనల్లో "సముద్రం", "గమ్యం", "పాటల పంట" వంటి కవితా సంపుటులు ప్రసిద్ధి పొందాయి. ఆయేవి కేవలం సాహిత్య పరమైన కృషి కాదు — అవి విప్లవ గీతాలు. కార్మికుల శ్రమ, రైతుల వేదన, దళితుల నిరాశ, గిరిజనుల గొంతులన్నీ ఆ కవితల్లో ఒక్కటయ్యాయి. ఆయన భాష సూటి, సరళమైనది. ప్రజలకు దగ్గరగా ఉండేలా, వారి భాషను పూనుకునేలా రచన చేశారు. అందుకే ఆయన పదాలు పల్లె గడపల్లోనూ, ఉద్యమ వేదికల మీదనూ, జైలు గదుల్లోనూ ప్రతిధ్వనించాయి.

చరబండ రాజు జీవితం కవిత్వంతో పాటు ఉద్యమాలకి అంకితమైంది. ప్రభుత్వ వ్యతిరేకత, దమన చర్యలపై గళమెత్తినందుకు ఆయన్ను అనేకసార్లు అరెస్టు చేశారు. అయినా ఆయన పోరాట పంథా మారలేదు. కలాన్ని ఉక్కుపాదంగా మలిచి, శబ్దాన్ని నినాదంగా తీర్చి ప్రజల ఆక్రోశానికి ప్రతిధ్వనిగా నిలిచిన వాడు. అరెస్టులు, నిర్బంధాలు, ఆరోగ్య సమస్యలు – ఇవేవీ ఆయన సంకల్పాన్ని దెబ్బ తీయలేక పోయాయి.

రచయితగా కాకుండా పాత్రికేయునిగా కూడా ఆయన పాత్ర విశేషమైనది. "ఉద్యమ" పత్రికకు సంపాదకుడిగా వ్యవహరించిన సమయంలో విప్లవ ఆలోచనలను ప్రజల్లోకి చొప్పించేందుకు విస్తృతంగా రచనలు చేశాడు. సామాజిక, రాజకీయ విశ్లేషణలతో కూడిన వ్యాసాల ద్వారా చైతన్యాన్ని నింపాడు. ఆయన రచనలన్నీ ఒక పాఠశాల వలె. ఉద్యమ భావజాలాన్ని నేర్పించే పాఠాలు.

ఆయన రచనల్లో అంబేడ్కర్ భావజాలం, మార్క్సిస్టు సిద్ధాంతం, మానవీయ తత్వం మేళవించాయి. శోషిత వర్గాల సంక్షేమమే ఆయన రచనల గుండెచప్పుడు. సామాజిక న్యాయం, సమానత్వం, స్వాతంత్రం కోసం నిరంతరం పోరాడిన కలం ఆయనది. ఆయన భావనలు కేవలం పాఠశాలలు, వేదికలకే పరిమితం కాలేదు – ఉద్యమాలలో, ప్రదర్శనలలో, పాటలుగా మారి ఊపిరి లేని ప్రజలకు ఊపిరివ్వ గలిగాయి.

1982 జూలై 2న మెదడు క్యాన్సర్ కారణంగా రాజు తన పోరాట యాత్రను ముగించారు. కానీ ఆయన మరణించినా, ఆయన ఆలోచనలు మరణించలేదు. ఆయన రచనలు ఇప్పటికీ యువ ఉద్యమకారుల చేతుల్లో నినాదాలుగా వినిపిస్తాయి. మార్పు కోసం పరిగెడుతున్న ప్రతి పాదంలో, నిరసనగా మారిన ప్రతి కంఠంలో, న్యాయం కోసం నలిగిన ప్రతి గుండెల్లో చరబండ రాజు పదాలు మౌలిక శక్తిగా మారుతూనే ఉన్నాయి.

చరబండ రాజు కవిత్వం ఒక ఉద్యమ శబ్దం. ఆయన జీవితం ఒక మార్గదర్శక దీపం. తన జీవితాన్నే ప్రజల కోసం అంకితం చేసిన ఈ విప్లవ కవి, తెలుగు సాహిత్యంలో శాశ్వతంగా నిలిచిపోయిన ప్రజల స్వరం. చరబండ రాజు – ఒక పద్యం కాదు, ఒక ప్రజా చరిత్ర.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్**
**ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

## ప్రజల కష్టాలు తీర్చే పవర్ హౌస్‌లా

# పంచాయతీరాజ్ వ్యవస్థ మారాలి?

**గత ప్రభుత్వ విజన్ లేని పాలన వల్లే పంచాయతీలు దెబ్బ తిన్నాయి**
**-గత రెండేళ్లలో గ్రామ పంచాయతీల ఖాతాల్లోకి నేరుగా రూ.4,200 కోట్లు బదిలీ**
**-వ్యవస్థలు బలంగా నడవాలంటే ఉద్యోగుల పాత్రే కీలకం**
**-ప్రజల కోసం మీరు ఒక అడుగు వేస్తే... మీ కోసం నేను వంద అడుగులు వేస్తా**
**-మనం చేసే ప్రతి పనిలో పారదర్శకత ఉండాలి**
**-ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

అమరావతి, జూలై 1 (నినాదం):

'పంచాయతీరాజ్ వ్యవస్థ కేవలం పిటీషన్లు తీసుకొని వాటిని పైకి నెట్టేసే వ్యవస్థలా కాకుండా... ప్రజల కష్టాలు తీర్చే పవర్‌హౌస్ లా మారాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో సరైన ప్రణాళికలు, విజన్ లేకపోవడం వల్లే గ్రామ పంచాయతీలు తమ పూర్తి సామర్థ్యాన్ని కోల్పోయి నిర్వీర్యమయ్యాయని, స్థానిక సంస్థల నిధులను దారి మళ్లించడం, గ్రామ సభలను నిర్లక్ష్యం చేయడం వల్ల గ్రామీణ స్వపరిపాలన వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లోపాలను సరిదిద్ది, ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలను మళ్లీ పూర్వవైభవానికి తీసుకురావడానికి గట్టి పట్టుదలతో పని చేస్తుందని స్పష్టం చేశారు. గడిచిన రెండేళ్ల కాలంలో రూ.4200 కోట్ల నిధులను నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాలకు బదిలీ చేశామని తెలిపారు. మంగళవారం రాత్రి ప్రభుత్వ అదనపు కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి ఓ.ఎస్.డి. కఠారి వెంకట కృష్ణ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "పాలనా పరంగా నాకు పెద్దగా అనుభవం లేకపోయినా, 2 లక్షల మంది ఉద్యోగులతో కూడిన పంచాయతీరాజ్ వ్యవస్థను ఇంత విజయవంతంగా నిర్వహించడానికి వెంకట కృష్ణ కారణం. ఆయన దగ్గర ఒక విద్యార్థిలా మారి ఎన్నో పాఠాలు నేర్చుకున్నాను. 36 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఆయనపై చిన్నపాటి మరక కూడా లేదు. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. అలాంటి వ్యక్తి రిటైర్ అయిపోతున్నారని తెలియగానే భుజం కొట్టేసినట్లు అనిపించింది. అందుకే ఆయన సేవలు మరో మ దేళ్లు కొనసాగేలా చర్యలు తీసుకున్నాం. ఇటువంటి అధికారుల వల్లే వ్యవస్థలపై నమ్మకం పెరుగుతుంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ఎన్నో ఉన్నతమైన ప్రభుత్వ పథకాల రూపకల్పనలో ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. కేవలం పథకాలను రూపొందించడమే కాదు... ప్రభుత్వ వ్యవస్థల నియంత్రణలో, ప్రగతిశీల అభివృద్ధిలో, అత్యుత్తమ పరిపాలనా విధానాల అమలులో ఆయన చూపిన చొరవ అసాధారణమైనది. ప్రభుత్వ రంగంలో ఆయనకున్న అపార అనుభవం, సంక్లిష్ట సమయాల్లో ఆయన తీసుకున్న కీలక నిర్ణయాలు, చూపిన మేధస్సు నేటికీ, రేపటికీ ఎప్పటికీ ఎంతో మంది అధికారులకు, ఉద్యోగులకు ఒక దిక్సూచిలా, మార్గదర్శకంగా నిలుస్తాయి. పాలసీ మేకింగ్ నుంచి అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ వరకు.. హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ నుండి బడ్జెట్ అండ్ ఫైనాన్షియల్ ప్లానింగ్ వరకు.. యాంటీ కరప్షన్ స్ట్రాటజీస్ నుంచి లీగల్ అఫైర్స్ వరకు ప్రభుత్వ యంత్రాంగంలోని ప్రతి విభాగంలోనూ ఆయన ముద్ర కనిపిస్తుంది. ఇటువంటి అధికారుల వల్లే ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం రెట్టింపు అవ్వడంతో పాటు, వ్యవస్థలు బలోపేతం అవుతాయి.

ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతిననివ్వం

ప్రజలకు సేవలు సక్రమంగా అందాలన్నా, వ్యవస్థలు బలంగా నడవాలన్నా అందులో పనిచేసే ఉద్యోగులు పాత్ర కీలకం. మీస్థాయిలో తెగని సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురండి... దానికి మనందరం కలిసి దారి వెతుకుదాం.మీరు ప్రజల కోసం ఒక అడుగు ముందుకేసి కమిట్‌మెంట్‌తో నిలబడితే... నేను వంద అడుగులు వేయడానికి సిద్ధంగా ఉన్నాను. గాలివీడులో ఎంపీడీవోపై దాడి జరిగితే నేనే స్వయంగా వెళ్లి ఆయనకు భరోసా కల్పించాను. శ్రీశైలం సమీపంలోని శిఖరం చెక్‌పోస్ట్ దగ్గర అటవీశాఖ ఉద్యోగులపై దాడి చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేశాం. బాధితులను కలిసి భరోసా కల్పించాం. విధి నిర్వహణలో భాగంగా ఉద్యోగులు ఎదుర్కొనే కేసులు



త్వరగా తేలకపోవడం వల్ల అర్హులైన వారు తమకు రావలసిన పదోన్నతులను కోల్పోతున్నారు. జీవితాంతం సేవ చేసిన ఉద్యోగులకు విశ్రాంత కాలంలో అందాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుదీర్ఘ కాలంపాటు విచారణలను సాగదీయడం వల్ల ఉద్యోగులు తీవ్ర మానసిక క్షోభకు గురై, వారి మనోధైర్యం దెబ్బతింటుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, నీటి సరఫరా శాఖల పరిధిలోని కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాము. విచారణ ప్రక్రియలను వేగంగా ముగించి, నిర్దోషులుగా తేలిన ఉద్యోగులకు తక్షణమే లబ్ధి చేకూర్చేలా చూశాము. గతంలో ప్రమోషన్ కావాలంటే పైరవీలు చేయాలి... బదిలీ కావాలంటే సిఫార్సులు పెట్టాలి. కానీ ఇప్పుడు ఆ పాత సిస్టమ్ కు ముగింపు పలికాం.

ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీలు, శిక్షణ ప్రక్రియలలో పూర్తి పారదర్శకతతో వ్యవహరించాం. అలా వ్యవహరించాం కాబట్టే మునుపెన్నడూ లేని విధంగా పంచాయతీరాజ్ శాఖలో ఏకంగా 10 వేలకు పైగా ప్రమోషన్లను అత్యంత పారదర్శకంగా కల్పించగలిగాం. పంచాయతీ రాజ్ ఉద్యోగులు ఇతర ప్రభుత్వ శాఖల పనితీరును అర్థం చేసుకోవడానికి దాదాపు 24 శాఖలలో డెప్యుటేషన్ పై పనిచేసేందుకు అనుమతి ఇచ్చాం. సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తూ, డివిజన్ స్థాయి అధికారులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకురావడానికి డీఎల్డీవో కార్యాలయాలు తీసుకొచ్చాం. కొన్ని దశాబ్దాలుగా ప్రమోషన్లకు నోచుకోని 77 మంది అధికారులకు జెడ్పీ సీఈవోలు గా ప్రమోషన్లు కల్పించాం. అందరూ ఒక టీమ్‌గా పని చేయాలి ప్రభుత్వం అందిస్తున్న అండను, స్ఫూర్తిని పూర్తిగా అర్థం చేసుకుని, విమీరంతా పంచాయతీరాజ్ వ్యవస్థలో ఒక నూతన వరవడిని తీసుకురావాలి. సీఈవో నుంచి పంచాయతీ అభివృద్ధి అధికారి వరకు అందరూ ఒక టీమ్ గా పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు ప్రతి పేదవాడి ఇంటి గడప చేరతాయి. మనం చేసే ప్రతి పనిలో పారదర్శకత ఉండాలి... అప్పుడే జనం మనతో నడుస్తారు. ప్రజలు భాగస్వాములు కానిదే ఏ సమాజంలోనూ మార్పు రాదు. ప్రజల చేతులకు కేవలం డబ్బులు అందించడం కాదు... ఊరి బాధ్యతను కూడా వాళ్ల చేతుల్లో పెట్టినప్పుడే అసలైన మార్పు మొదలవుతుంది. ఆ భాగస్వామ్యమే మన పంచాయతీలకు అసలైన బలమవుతుంది. అధికారులు కూడా ప్రజలను కేవలం పథకాలు తీసుకునే 'లబ్ధిదారులు'గా కాకుండా, గ్రామాభివృద్ధిలో కీలక భాగస్వాములుగా గుర్తించినప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుంది. ఆక్రమణలకు గురైన భూములను కాపాడాలిగత ప్రభుత్వ హయాంలో గ్రేజింగ్ ల్యాండ్స్, కమ నిటీ ల్యాండ్స్, కుంటలు, ఇతర ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. అధికారులు పూర్తి బాధ్యత తీసుకుని ఈ భూములను కాపాడాలి. వారు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ఆక్రమణలను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవడం ద్వారానే పంచాయతీ ఆస్తులకు రక్షణ లభిస్తుంది. అది క్షేత్రస్థాయి పాలన వైఫల్యమే చిన్న సమస్యల కోసం కూడా ప్రజలు సీఎం, డిప్యూటీ సీఎంల దాకా రావాల్సి రావడం మన క్షేత్రస్థాయి పాలన వైఫల్యానికి నిదర్శనం. నెల్లూరు జిల్లా గజ్జలవారిపల్లి గ్రామంలో రోడ్డు లేక బురదలో ఇబ్బంది పడుతున్నామని చిన్నారులు సోషల్ మీడియా ద్వారా నా దృష్టికి తెచ్చారు. ఆ సమస్య తెలిసిన వెంటనే రోడ్డు నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేశాం. అయితే దీనిని నేను ఒక విజయంగా భావించడం లేదు. అంత చిన్న సమస్య కూడా స్థానికంగా పరిష్కారం కాకపోవడం మన ఫెయిల్యూర్ గా భావిస్తున్నాను. అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుని, స్థానిక సమస్యలను గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కరించేలా మెకానిజంను బలోపేతం చేయాల'న్నారు.

## వీబీ`జీ`రామ్`జీ పథకానికి నేడు శ్రీకారం

**తిరుపతి జిల్లాలో ప్రారంభించనున్న మంత్రులు**

**ముఖ్య అతిథులుగా సిఎంబ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాక**

తిరుపతి: రాష్ట్రంలో మాత్రం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జూలై 2వ తేదీన పథకాన్ని తిరుపతిలో ప్రారంభించనున్నారు. అదేరోజు జిల్లాలో కొత్త పథకం అమలులోకి రానుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం.. బుధవారం నుంచి 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, అజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీ`జీ`రామ్`జీ)'గా మారింది. వలసలకు అడ్డుకట్ట వేస్తూ 2006లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణులకు పనులు కల్పిస్తూ తీసుకొచ్చిన ఎంజీ ఎనఆరఈజీఎస్ మంగళవారంతో ముగిసింది. బుధవారం నుంచి వీబీ`జీ`రామ్`జీ అమల్లోకి వస్తున్నా.. గురువారం తిరు పతి జిల్లాలోని ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె పంచాయతీ మంగంపేటలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, కమలేష్ పశ్వాన్, పెమ్మసాని చంద్రశేఖర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)ద్వారా కొత్త పథకాన్ని కొనసాగించనున్నారు. ఇందుకోసం డ్వామా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కాగా, ఇప్పటి వరకు కూలీలకు తప్పనిసరిగా వంద రోజుల ఉపాధి పనులు కల్పిస్తున్నారు. వీబీ`జీ`రామ్`జీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉండి ఉపాధి పనులకు వచ్చే ప్రతి కుటుంబానికి ఏటా 125 పనిదినాలు కల్పిస్తారు. రెండు వారాలకు ఒకసారి ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లిస్తారు. ఒకవేళ చెల్లింపుల్లో జాప్యం జరిగితే, ప్రత్యేక పరిహారం చెల్లిస్తారు. ఆరు నెలలకు ఒక సారి సామాజిక తనిఖీలు నిర్వహిస్తారు. క్షేత్రస్థాయిలోని లోపాలు ఎప్పుటికప్పుడు సవరించడానికి కూలీల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, త్వరతగతిన పరిష్కారం చేపట్టనున్నారు. పశువుల కొట్టాలు, కంపోస్టు పిట్స్, అమృత్/మినీ అమృత్ సరోవర్లు, పశువులకు చెరువులు, పూడికతీత, పునరుద్ధరణ, చెక్‌డ్యాంల పూడికతీత, ఫీడర్లు, ఫీల్డ్ ఛానెళ్లు, తవ్విన చెరువులు, చేపల చెరువులు, పశుమేత అభివృద్ధి, ఇంకుడు కుంటలు, మేజిక్ కాలువలు, రీ బుష్ ప్లాంటేషన్, కొత్త చెక్ డ్యాంలు, ప్లాంటేషన్, నర్సరీలు, సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, బీటీ రోడ్లు, ట్రెంచ్‌లు తదితర పనులు చేపట్టనున్నారు. ఈ పనులను చూస్తుంటే.. రైతులకు పాక్షికంగా మేలు చేసేలా ఉంది. నూతన సంస్కరణలతో వ్యవసాయ రంగానికి, రైతాంగానికి పూర్తిగా ప్రయోజనం చేకూరనుంది.



చుక్క నూనె, మినపప్పు లేకుండా

# మెత్తటి స్పాంజీ దోసె..

**ఇంట్లో పెద్దవాళ్లు, పిల్లలకు పెట్టే హెల్దీ బ్రేక్ ఫాస్ట్**

చుక్క నూనె లేకుండా, మినపప్పు లేకుండా మెత్తటి దోసె చేసే మెత్తటి స్పాంజ్ దోసె చాలా మంది ఇష్టంగా తింటారు. వీటిని ఎలా తయారు చేయాలో, ఏమేం కావాలో ఇక్కడ తెలుసుకుందాం..





మర్మరాలు సుమారు 3 కప్పులు, బియ్యం ఒకటిన్నర కప్పు, అర టీ స్పూన్ మెంతులు, ఉప్పు తగినంత, నీళ్లు అవసరమైనంత తీసుకుంటే సరిపోతుంది. ఇందులో పెరుగు, వంట సోడా, ఈనో వంటివి చేర్చకుండానే మెత్తని దూదిలాంటి దోసె తయారు చేయవచ్చు.

బియ్యం, మెంతులను బాగా కడిగి ఒక పాత్రలో వేసుకోవాలి. ఇదులో నీళ్లు పోసి సుమారు 5 గంటలు నానబెట్టాలి. నానిన మిశ్రమాన్ని నీరు వంపి మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి. అవసరమైనంత నీరు కలిపి దోసె పిండిలా జారుగా చేసుకోవాలి.

పిండిని కొంతసేపు పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత మర్మరాలను ఒక గిన్నెలోకి తీసుకుని, నీళ్లు పోసి బాగా కడిగి.. మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పండిని కూడా దోసె పిండిలో కలుపుకుంటే సరిపోతుంది. ఇలా కలుపుకున్న పిండిని 8 గంటలపాటు పులియబెట్టాలి. పిండిని 6-8 గంటలు లేదా రాత్రంతా మూత పెట్టి ఉంచితే ఇంకా మెత్తటి దోసెలు వస్తాయి. తర్వాత అందులో కావల్సిన మేరకు ఉప్పు వేసుకుని దోసె వేసుకోవచ్చు.

వేడి తవాపై ఒక గరిటె పిండి పోసి దోసెలా పరచాలి. నూనె వేయకుండా మధ్యస్థ మంటపై మూత పెట్టి కాల్చాలి. ఒక వైపు బాగా కాలిన తర్వాత తీసి వేడివేడిగా వడ్డించాలి. దీనిలోకి టమాట చట్నీ వేసుకుంటే రుచి అదిరిపోతుంది.


ఇందులో మర్మరాలు ఎక్కువగా ఉండటం వల్ల దోసెలు చాలా మెత్తగా వస్తాయి. పిండి బాగా పులిస్తే హోటల్ స్టైల్ స్పాంజీ దోసెలు వస్తాయి. నాన్‌స్టిక్ పెనం వాడితే నూనె లేకుండానే సులభంగా తీసుకోవచ్చు. పిండిలో ఒక చిటికెడు చక్కెర వేస్తే దోసెలు మరింత బంగారు రంగులోకి వస్తాయి. ఈ రెసిపీతో వచ్చే దోసెలు చాలా మెత్తగా, స్పాంజీగా ఉండి పిల్లలు, ఇంట్లో పెద్ద వాళ్లు కూడా ఇష్టంగా తింటారు.




రోజంతా కుర్చీలోనే

# కూర్చుంటున్నారా?






గంటల తరబడి కూర్చుని పనిచేసే ఐటీ, డెస్క్ జాబ్ ఉద్యోగులకు ఇది ముఖ్యమైన హెచ్చరిక. ఆఫీసు కుర్చీలో ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల అనేక సమస్యలు వస్తాయని నిపుణులు చాలా కాలంగా చెబుతున్నారు. ముఖ్యంగా ఐటీ నిపుణులు, డ్రైవర్లు, కాల్ సెంటర్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర డెస్క్ వర్కర్లు రోజుకు 8 నుండి 10 గంటల పాటు కుర్చీలో కూర్చొని గడుపుతారు. కానీ, ఎక్కువ సేపు ఒకే భంగిమలో కూర్చోవడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇప్పుడు ఈ నిజం మరోసారి వెలుగులోకి వచ్చింది.



**కూర్చుని పనిచేసే వారిని వేధించే ప్రధాన సమస్యలు:**
వెన్నునొప్పి, మెడనొప్పి: గంటల కొద్దీ కంప్యూటర్ ముందు తల దించి పనిచేయడం వల్ల మెడ (సర్వైకల్), భుజాలు, వెన్నెముకపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. సరైన భంగిమలో (పోశ్చర్) కూర్చోకపోవడం వల్ల చిన్న వయసులోనే స్పాండిలైటిస్, బ్యాక్ పెయిన్ సమస్యలు వస్తున్నాయి.



కంటి సమస్యలు (కంప్యూటర్ విజన్ సిండ్రోమ్): స్క్రీన్‌ను నిరంతరంగా చూడటం వల్ల కళ్లు పొడిబారడం (డ్రై ఐస్), కంటి చూపు మందగించడం, తరచుగా తలనొప్పి రావడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి.

**ఊబకాయం, గుండె జబ్బులు:**
శరీరానికి ఎలాంటి వ్యాయామం లేకపోవడంతో కొవ్వు పేరుకుపోయి బరువు పెరుగుతారు. ఇది క్రమంగా రక్తపోటు (బీపీ), మధుమేహం (డయాబెటిస్), హృద్రోగాలకు దారితీస్తుంది.

**మానసిక ఒత్తిడి:**



పని ఒత్తిడి, నిరంతరం స్క్రీన్ సమయం వల్ల చాలామందిలో మానసిక ఒత్తిడి (స్ట్రెస్), ఆందోళన పెరిగి నిద్రలేమి సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఎక్కువ సేపు ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల మలబద్ధకం , పైల్స్ వంటి సమస్యల ప్రమాదం పెరగవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**ఈ సమస్యల నుండి ఎలా బయటపడాలి?:**
డెస్క్ జాబ్ చేసేవారు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొన్ని నియమాలు పాటించడం తప్పనిసరి:

**బ్రేక్ తీసుకోండి:** ప్రతి గంటకోసారి కనీసం 5 నిమిషాల పాటు కుర్చీలోంచి లేచి కొద్దిగా అటూ ఇటూ నడవాలి.

**కంటి రక్షణ (20-20-20 రూల్):**
ప్రతి 20 నిమిషాలకు ఒకసారి, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును కనీసం 20 సెకన్ల పాటు చూడటం అలవాటు చేసుకోండి. ఇది కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది.

**స్ట్రెచింగ్ వ్యాయామాలు:**
కుర్చీలో కూర్చున్న చోటే మెడ, చేతులు, కాళ్ళను అప్పుడప్పుడూ స్ట్రెచ్ (సాగదీయడం) చేస్తూ ఉండాలి.

**సరైన సీటింగ్ భంగిమ:**
వెన్నెముక నిటారుగా ఉండేలా చూసుకోవాలి. కంప్యూటర్ స్క్రీన్ కంటికి నేరుగా ఉండేలా మానిటర్ ఎత్తును సెట్ చేసుకోవాలి.



**నీరు త్రాగండి:**
శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి మధ్యమధ్యలో తగినంత నీరు తాగుతూ ఉండాలి.

కూర్చుని పనిచేయడం తప్పనిసరి అయినా, పని మధ్యలో చిన్నపాటి విరామాలు, సరైన జాగ్రత్తలు పాటిస్తే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల బారిన పడకుండా మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చు.

## ఏడాది వ్యాలిడిటీతో వొడాఫోన్ ఐడియా కొత్త ప్రీపెయిడ్ ప్లాన్

ప్రముఖ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా సరికొత్త ప్రీ పెయిడ్ ప్లాన్‌తో ముందుకొచ్చింది. రూ. 4600తో వార్షిక ప్రీ పెయిడ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. అపరిమిత కాల్స్, డేటాతో దేశవ్యాప్తంగా ఉన్న 4జీ, 5జీ యూజర్లకు ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం కొన్ని సర్కిళ్లలోనే అందుబాటులో ఉంది. త్వరలో అన్ని సర్కిళ్లకూ విస్తరించనుంది. ఈ ప్లాన్ 365 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. రోజూ అపరిమిత డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్ లభిస్తాయి. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. వ్యక్తిగత, నాన్ కమర్షియల్ ఉపయోగా నికి మాత్రమే ఈ ప్లాన్‌ను తీసుకొచ్చింది. 5జీ నెట్‌వర్క్ కవరేజీ ఉన్న ప్రాంతంలో 5జీ అపరిమిత డేటా లభిస్తుంది. అపరిమిత డేటాపై రోజువారీ పరిమితి లేకపోయినప్పటికీ.. 28 రోజులకు గరిష్ఠంగా 300 జీబీ వరకు మాత్రమే డేటా వినియోగించు కోవచ్చు. పరిమితి మించాక వేగం నెమ్మదిస్తుంది. రోజుకు రూ. 12.6 చొప్పున ఖర్చు అవుతుంది.




వార్షిక ప్లాన్‌తో పాటు 6 నెలల వ్యాలిడిటీతో మరో ప్లాన్‌నూ వొడాఫోన్ ఐడియా తీసుకొచ్చింది. 180 రోజుల వ్యాలిడిటీతో రూ. 2,475 ప్రీ పెయిడ్ ప్లాన్‌ను లాంచ్ చేసింది. ఈ ప్లాన్‌లోనూ అపరిమిత డేటా, అపరిమిత కాల్స్ అందిస్తుంది. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. వార్షిక ప్లాన్ మాదిరిగానే డేటా పరిమితి నిబంధనలు వర్తిస్తాయి.




## నాలుగు భారత సంస్థలపై ఆంక్షలు తొలగించిన అమెరికా

భారత్‌కు చెందిన నాలుగు సంస్థల పై అమెరికా తాజాగా ఆంక్షలు తొలగించింది . రష్యా సంస్థలతో కలిసి పనిచేస్తున్నాయన్న కారణంతో ఆర్ఆర్‌జీ ఇంజినీరింగ్ టెక్నాలజీస్, లోకేష్ మెషిన్స్ లిమిటెడ్, గెలాక్సీ బేరింగ్స్, శౌర్య ఏరోనాటిక్స్ కంపెనీలను గతంలో నిషేధిత సంస్థల జాబితాలో చేర్చింది. వీటిల్లో ఆర్ఆర్‌జీ ఇంజినీరింగ్, లోకేష్ మెషిన్స్ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. తాజాగా వీటిపై సమీక్ష జరిపిన అగ్రరాజ్యం.. ఈ నాలుగు సంస్థలపై ఆంక్షలను ఎత్తివేసింది.

రోలర్ బేరింగ్‌లు, అసెంబుల్ పరికరాలను రష్యన్ సంస్థల కు ఎగుమతి చేసిందనే ఆరోపణలతో గెలాక్సీ బేరింగ్స్ లిమిటెడ్‌పై 2024 అక్టోబరులో అమెరికా ఆంక్షలు విధించింది. రాడార్ పరికరాలు, రేడియో నావిగేషనల్ ఎయిడెడ్ పరికరాలు, రేడియో రిమోట్ కంట్రోల్ ఉపకరణాలను రష్యాకు



పంపిందన్న కారణంతో శౌర్య ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకుంది. నిర్బంధం విధించిన జాబితాలో ఉన్న రష్యా కంపెనీ ఆర్టెక్స్ లిమిటెడ్‌కు 100కు పైగా మైక్రో ఎలక్ట్రానిక్స్ సరుకులను సరఫరా చేసినందుకుగానూ ఆర్ఆర్‌జీ ఇంజనీరింగ్ టెక్నాలజీస్‌పై ఆంక్షలు తీసుకొచ్చింది. రష్యన్ తయారీ కంపెనీలకు డజన్ల కొద్దీ మెషిన్ టూల్స్ రవాణా చేసినందుకు లోకేష్ మెషీన్స్ సంస్థను నిషేధిత సంస్థల జాబితాలో చేర్చింది.

## రెండు రోజుల నష్టాలకు బ్రేక్.. లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలు, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో మన మార్కెట్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, రియాల్టీ, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో స్టాక్ మార్కెట్‌లో రెండు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ 443 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 162 పాయింట్ల పైకి చేరింది.



సెన్సెక్స్ ఉదయం 76,545.21 పాయింట్లు (క్రితం ముగింపు 76,478.67) వద్ద స్వల్ప లాభాలతో ప్రారంభమైంది. రోజంతా సూచీలు లాభాల్లోనే కదలాడాయి. ఇంట్రాడేలో 77,110.08 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 443.97 లాభంతో 76,922.64 వద్ద ముగిసింది. నిఫ్టీ 140.10 పాయింట్ల లాభంతో 24,005.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నెల్, ఏషియన్ పెయింట్స్, హిందూస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, టీసీఎస్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.23గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.34 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 3,987 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# చిక్కుల్లో వాట్సప్..

## యూజర్ నేమ్‌పై కేంద్రం నజర్

ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ తీసుకొస్తున్న యూజర్‌నేమ్ సదుపాయంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ప్రముఖుల పేర్లతో మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, దుర్వినియోగానికి ఈ ఫీచర్ వీలు కల్పిస్తోందన్న ఆందోళనల నేపథ్యంలో దీనిపై దృష్టి సారించింది. వాట్సప్ తీసుకొస్తున్న కొత్త ఫీచర్‌ను కేంద్రం పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ మోసాలు, వినియోగదారుల భద్రత కోణంలో సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఏదైనా ముప్పు పొంచి ఉందని తెలితే మెటాకు నోటీసు జారీ చేసే అవకాశముందని తెలిపాయి. జాతీయ భద్రత విషయంలో రాజీపడేది లేదని కేంద్రం స్పష్టంచేసినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

**తక్కువ బ్యాగేజీతో ప్రయాణించేవారి కోసం ఇండిగో లైట్**

ఏమిటీ యూజర్ నేమ్ ఫీచర్
ఫోన్ నంబర్ ప్రైవసీని కాపాడుతూ యూజర్ నేమ్ ఆప్షన్‌ను వాట్సప్ తీసుకొస్తోంది. దీనివల్ల యూజర్లు ఫోన్ నంబరును షేర్ చేయాల్సిన అవసరం ఉండదు. కేవలం యూజర్ నేమ్‌ద్వారా సంభాషణలను జరపవచ్చు. ప్రస్తుతం యూజర్ నేమ్‌ను రిజర్వు చేసుకునేందుకు వాట్సప్ అనుమతిస్తోంది. యూజర్ నేమ్‌లో 3 నుంచి 35 క్యారక్టర్లను అనుమతిస్తారు. అందులో సెలబ్రిటీలు, అత్యున్నత స్థాయి వ్యక్తుల పేర్లను అనుమతించబోరు. యూజర్ నేమ్‌వల్ల ఫోన్ నంబరు కనిపించదని, పెద్ద గ్రూపుల్లో మీరు యాడ్ అయినప్పుడు మీ ప్రైవసీకి రక్షణ లభిస్తుందనేది వాట్సప్ వాదన.




**ఆందోళనలు ఏమిటి?**

ఫోన్ నంబర్‌ను షేర్ చేయకుండా చాట్ చేయడానికి వాట్సప్ తీసుకొచ్చిన యూజర్ నేమ్ సదుపాయంపై సైబర్ నిపుణులు ఆందోళనలు వ్యక్తంచేస్తున్నారు. సుపరిచిత వ్యక్తుల పేర్లతో నకిలీ యూజర్‌నేమ్స్ సృష్టించి, ప్రజలను మోసం చేసేందుకు ఈ ఫీచర్ అవకాశం కల్పిస్తోందని హెచ్చరిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఏదో ఒక యూజర్‌నేమ్‌ను అంచనా వేసి నేరుగా మెసేజ్ చేసే అవకాశం ఉండటంతో స్పామ్ కాల్స్, సందేశాలు పెరిగే అవకాశం ఉందని సైబర్ నిపుణుల వాదన. ఫోన్ నంబర్లు గోప్యంగా ఉంచడం వరకు బాగున్నా.. మోసాలను అరికట్టడానికి తగిన భద్రతా చర్యలు లేకపోతే టెలిగ్రాం తరహా మోసాలకు వాట్సప్ వేదికగా మారుతుందన్న ఆందోళనలూ నెలకొన్నాయి.

# వచ్చే ఏడాదే దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్..

### ఈ రూట్లోనే పరుగులు.. ముహూర్తం ఖరారు..

దేశంలో తొలి హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్‌పై కేంద్ర ప్రభుత్వం బిగ్ అప్డేట్ ఇచ్చింది. తొలి కారిడార్ ప్రారంభానికి ముహూర్తం ఖరారు చేసింది. ముంబై-అహ్మదాబాద్ కారిడార్‌లో భాగంగా సూరత్-వాపి మార్గంలో తొలి బుల్లెట్ రైలు ప్రవేశపెట్టనున్నారు.

ఈ మార్గంలో పనులు దాదాపుగా పూర్తయ్యాయని రైల్వే శాఖ స్పష్టం చేసింది. దీంతో 2027లో ఈ కారిడార్‌ను ప్రారంభించనున్నారు. వచ్చే ఏడాది ఆగస్ట్ 15వ తేదీన ఈ మార్గంలో తొలి బుల్లెట్ రైలును ప్రారంభించేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. దేశంలోనే తొలి బుల్లెట్ రైలు మార్గంగా సూరప్-వాపి నిలవనుంది.

**కొలిక్కి వచ్చిన పనులు**

గత కొన్నేళ్లుగా పలుమార్లు సూరత్-వాపి సెక్షన్‌లో నిర్మాణ పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. అయితే ఇప్పుడు అన్ని సమస్యలు తొలగిపోయి పనులు వేగవంతమైనట్లు తాజాగా రైల్వేశాఖ ప్రకటన జారీ చేసింది. గణనీయమైన స్థాయిలో పనులు పూర్తయ్యాయని స్పష్టం చేసింది. జపాన్ టెక్నాలజీతో ఈ కారిడార్‌ను అభివృద్ధి చేస్తున్నారు. జపాన్ సాంకేతికతో పాటు ఆర్థికంగా నిధులు కూడా సమకూర్చుతోంది. ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ బుల్లెట్ రైల్ ప్రాజెక్ట్ మొత్తం 508 కిలోమీటర్ల ఉంటుంది. సివిల్ పనులు, వంతెనల నిర్మాణం, స్టేషన్ల అభివృద్ధి పనుల్లో ముఖ్యమైన భాగం పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టులో సూరత్-వాపి కారిడార్‌లో అత్యంత ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. భూ సేకరణ సమస్యలు, వివిధ సంస్థల నుంచి ఆమోదాలు, కోవిడ్ కారణంగా గతంలో ఈ ప్రాజెక్టు పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. అయితే గత రెండేళ్లుగా నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. గుజరాత్‌లో చాలా వరకు భూ సేకరణ ప్రక్రియ పూర్తవ్వడంతో నిర్మాణ కార్యకలాపాల్లో వేగం పుంజుకుంది. ఈ హైస్పీడ్ రైలు కారిడార్‌లో బుల్లెట్ రైళ్లు గంటకు 320 కిలోమీటర్ల వేగంతో నడుస్తాయి. దీంతో ముంబై, అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయం సగానికి సగం తగ్గనుంది. జపాన్‌కు చెందిన ప్రఖ్యాత షింకన్సెన్ టెక్నాలజీతో ఈ కారిడార్ నిర్మిస్తున్నారు.

**దేశవ్యాప్తంగా 7 కారిడార్ల నిర్మాణం**
ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మొత్తం 7 బుల్లెట్ రైళ్ల కారిడార్లను



ప్రకటించింది. అందులో అహ్మదాబాద్-ముంబై ప్రాజెక్ట్ తొలుత ప్రారంభం కానుంది. ఇక హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-పుణె, బెంగళూరు-చెన్నై ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ కారిడార్లలో అలైన్‌మెంట్ సర్వే జరుగుతున్నాయి. ఇక భూ సేకరణ ప్రక్రియ కోసం వివిధ రాష్ట్రాలతో కేంద్రం సంప్రదింపులు జరుపుతోంది. భూ సేకరణలో రాష్ట్రాల సాయం తీసుకోవడం ద్వారా అడ్డంకులు ఉండవని భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మద్దతిచ్చేందుకు ముందుకొచ్చాయి. ఇక పర్యావరణ, పరిపాలన అనుమతులు లాంటివి పూర్తయిన తర్వాత ఈ కారిడార్ల పనులు ప్రారంభం కానున్నాయి

# ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

వైద్యో నారాయణో హరి

డాక్టర్‌ని దైవంతో పోల్చే సంప్రదాయం మనది

రైతే దేశానికి వెన్నుముక

రైతు పదికాలాలపాటు చల్లగా ఉండాలి

డాక్టర్ మధుకర్ రెడ్డి, డాక్టర్ కిషోర్ కుమార్





**సంగారెడ్డి బ్యూరో, జులై 1 (నినాదం):** బుధవారం డాక్టర్స్ డే సందర్భంగా పురస్కరించుకొని సదాశివ పేట పట్టణంలోని ఎంజి బ్యాంకట్ హాల్‌లో మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ అధ్యక్షన జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్లు మధుకర్ రెడ్డి, కిషోర్ కుమార్, హరీష్ రెడ్డి, రవీంద్రనాథ్, జస్వంత్, రోహిత్, సంతోష్ రెడ్డి, అన్వేష్, నవీన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, నాగశ్రీ లను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మధుకర్ రెడ్డి, డాక్టర్ కిషోర్ కుమార్లు మాట్లాడుతూ రైతు చక్కగా ఉంటేనే దేశం పది కాలాలు చక్కగా ఉంటుందని, అందరిని పోషిస్తున్నవాడు రైతే అని కొనియాడారు. అలాంటి రైతు సంఘం ఆధ్వర్యంలో మాకు సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్క రైతు ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ తన ఆరోగ్యాన్ని భద్రంగా ఉంచుకోవాలని, రైతే దేశానికి వెన్నెముక అన్నారు. రైతు పండించిన పంటనే అందరు తింటున్నారని అలాంటి రైతు చల్లగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. అనంతరం పృధ్వీరాజ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టరు, రైతు సమాఖ్య నాయకులు, వీరశైవ లింగాయత్ లింగ బలిజ నాయకులు బుధవారం మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పృధ్వీరాజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని వివిధ సంఘాల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పృధ్వీరాజ్ కు అందరూ పూల మాలలతో, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు రక్షణ సంఘం అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, ఓం శాంతి అక్క అన్నపూర్ణ, వెంకట్రావు, గంట శివయ్య, కిష్టయ్య, వీరశైవ లింగాయత్ లింగ బలిజ జిల్లా నాయకులు మాణ య్య సార్, మల్లికార్జున్ పాటిల్, గోపురాజు, శివ కుమార్, సంగిశెట్టి, అశోక్ బాబు, మహేష్ కుమార్, శివ కుమార్, మల్లన్న, మల్లికార్జున్, గౌరీశ్వర్, జగదీశ్వర్, మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర జిల్లా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆలయాలు.. మానసిక ప్రశాంతతకు నిలయాలు

కోదండ రామస్వామి దేవాలయానికి రూ. 50 వేల వితరణ

జవహర్‌నగర్ మాజీ మేయర్ మేకల కావ్య



**జవహర్ నగర్, జులై 1 (నినాదం):** ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని కోదండరామస్వామి ఆశీస్సులు జవహర్ నగర్ ప్రజలందరిపై ఉండాలని జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ వికలాంగుల కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న కోదండ రామ ఆంజనేయస్వామి దేవాలయానికి బుధవారం మాజీ మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో రూ. 50 వేల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని దైవ భక్తికి కొలువైన దేవాలయాలన్నారు. భక్తితోనే ఏదైనా గొప్పకార్యాలు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం జవహర్ నగర్ అధ్యక్షుడు సుధాకర్ చారి, బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు భార్గవరామ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌కు సన్మానం



**ఆమనగల్లు, జులై 01(నినాదం):** ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నాగర్ కర్నూల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గా ఎన్నికైన ఏ.రాంగోపాల్ ను ఘనంగా సత్కరించారు. అధ్యక్షులు అండే కార్ యాదిలాల్ సమక్షంలో సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, చిందం కృష్ణయ్య, ఉపాధ్యక్షులు శేఖర్, మల్లేష్, గణేష్ గౌడ్, సంతోష్ కుమార్, సర్దార్ నాయక్, ఆంజనేయులు, రామకృష్ణ, జగన్ గౌడ్, శ్రీనివాస్, మహేశ్వర్, శ్రీశైలం, మహేష్ తదితరులు పాల్గొన్నారు. రాంగోపాల్ సేవలను కొనియాడుతూ ఆయన మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకున్నారు. ఈ సత్కారం న్యాయవాద వృత్తిలో ఎంతో స్ఫూర్తిని నింపింది.

## ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



**ఆమనగల్లు, జులై 01(నినాదం):** ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. హెడ్ నర్స్ ప్రసన్న నేతృత్వంలో రేణుక, కృష్ణ లీల, మధు, దేవేందర్, నాగమణిలు ఎంతో ఉత్సాహంగా ఏర్పాట్లు చేశారు. డాక్టర్ నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, ఆయనను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేశారు. వైద్యుల నిబద్ధత, సేవాభావం గొప్పవని నర్సింగ్ సిబ్బంది కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇందిర, గోపాల్ రెడ్డి, గుజ్జరి శీను, మునిర, అంజమ్మ, ఆనంద్, నరేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్స్ డే దినోత్సవం

మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని

పరిరక్షిద్దాం సందేశం ఇచ్చిన వైద్యులు



**కుత్బుల్లాపూర్, జులై 1 (నినాదం):** టీజీఎస్ఆర్టీసీ తార్నాక ఆసుపత్రిలో జాతీయ వైద్యుల (డాక్టర్స్ డే) దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో వినూతనంగా పర్యావరణ పరిరక్షణకు అద్దం పట్టేలా వివిధ రకాల మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించే లక్ష్యంతో అత్యంత ఘనంగా జరిగాయి. సమాజ ఆరోగ్యానికి అహర్నిశలు శ్రమించే వైద్యుల సేవలను కొనియాడుతూనే, ప్రకృతిని కాపాడుకోవాలనే ఉన్నతమైన ఆశయంతో నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి టీజీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్, ఇంజినీరింగ్, మెడికల్) సిహెచ్. వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని, పవిత్రమైనదని కొనియాడారు. ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు చూపే నిస్వార్థ సేవ, కరుణ, అంకితభావం ఎంతోమంది చిన్న పిల్లలను భవిష్యత్తులో వైద్యులుగా ఎదగడానికి ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. మనుషుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు ఎంతగా శ్రమిస్తారో, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రకృతి ఇచ్చే మొక్కలు, వృక్షాలు అంతే సహకరిస్తాయని, అందుకే వాటిని 'ప్రకృతి వైద్యులు'గా అభివర్ణించారు. స్వచ్ఛమైన గాలిని అందిస్తూ జీవావరణాన్ని సంరక్షించే ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ పర్యావరణ హిత భావనకు ప్రతీకగా ఆసుపత్రి ప్రాంగణంలో ప్రతి వైద్యుడు తమ పేరు మీద ఒక మొక్కను నాటారు. కేవలం ప్రజల ఆరోగ్యమే కాకుండా, ప్రకృతి ఆరోగ్య పరిరక్షణకు కూడా తాము కట్టుబడి ఉన్నామని ఈ వినూత్న చర్య ద్వారా వైద్య బృందం చాటిచెప్పింది. వైద్యుల దినోత్సవాన్ని పర్యావరణ పరిరక్షణతో ముడిపెడుతూ నిర్వహించిన ఈ అద్భుత కార్యక్రమాన్ని అధికారులు, ఆసుపత్రి సిబ్బందితో పాటు రోగులు, వారి బంధువులు సైతం ప్రశంసించారు. ఈ వేడుకల్లో టీజీఎస్ఆర్టీసీ తార్నాక ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్, సూపరింటెండెంట్ డాక్టర్ శైలజా మూర్తి, మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పి. శ్రీనివాస్ లతో పాటు కార్పొరేషన్ సీనియర్ వైద్యులు, అధికారులు, పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు భారతదేశ పౌరులకు వజ్రాయుధం

ఓటరు సవరణలో ప్రజలందరూ భాగస్వాములు అవ్వండి

ఇంటింటికీ ఎన్యూమరేషన్ బృందం



**జవహర్‌నగర్, జులై 1 (నినాదం):** ఓటు భారత దేశ ప్రజలకు వజ్రాయుధం లాంటిదని ఓటరు జాబితా సవరణలో ప్రజలందరూ భాగస్వాములు అవ్వాలని గబ్బిలాల పేట అంగన్వాడీ టీచర్ అనురాధ పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బుధవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ గబ్బిలాలపేట పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించే ఎన్యూమరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ప్రజలకు ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచూసుకోవడం, అవసరమైతే కొత్త ఓటర్ ఐడీ కోసం దరఖాస్తు (అప్లికేషన్ ఫారం) సమర్పించడం, వివరాల్లో మార్పులు లేదా సవరణలు చేయించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకుని ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలని, ప్రజాస్వామ్య బలోపేతానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్పి రాజ్యలక్ష్మి, సీనియర్ జర్నలిస్టు దామరపల్లి నరసింహారెడ్డి, చింతల విజయ్, రఘు, వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ, బిజెపి కార్మిక నగర్ ఉపాధ్యక్షుడు రాజు, పాండు, కమలాకర్ తదితరులు పాల్గొని ప్రజలు ప్రత్యేక జాబితా సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకొని ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని తద్వారా ప్రజాస్వామ్య విలువలకు భారతదేశ ఔన్నత్యానికి ప్రజాస్వామ్య బలోపేతానికి తమ వంతు బాధ్యతగా కృషిచేసి ప్రజాస్వామ్య గొప్పతనాన్ని ప్రపంచానికి ఎలుగెత్తి చాటాలని పిలుపునిచ్చారు.

## ప్లాస్టిక్‌ను తరిమికొట్టండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి

**అల్వాల్, జులై 1(నినాదం):** ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక సేవకులు భోగ విష్ణుమూర్తి పేర్కొన్నారు. బుధవారం సిటిజెన్ కాలనీలోని శ్రీస్వయంబు ఆంజనేయఆలయం గత 4 నెలలుగా భక్తులకు ప్రసాదాలు స్టీల్ ప్లేట్ నీళ్లు స్టీల్ గ్లాసులో ఇస్తున్నారని ఆయన అన్నారు. భక్తుల ఆరోగ్యం పర్యావరణం దృష్టిలో ఉంచుకొని ముదడుగు వేసినట్లు ఆయన అన్నారు. ఆలయ కమిటి వారి విజ్ఞప్తి మేరకు భక్తులు స్టీలు ప్లేట్లు స్టీల్ గ్లాసులు విరాళాలుగా ఇస్తున్నామని ఇప్పటి వరకు 650 స్టీల్ ప్లేట్లు మరియు 50 స్టీల్ గ్లాసులు దాతల సహకారంతో ఆలయాలలో పంపిణీ చేసినట్లు ఆయన అన్నారుఇప్పటివరకు మన ఆల్వాల్ ప్రాంతంలో 7 దేవాలయాలలో స్టీల్ ప్లేట్లు స్టీల్ గ్లాసులు వాడుతున్నారు. దీని ఉద్దేశం ప్రతి దేవాలయం పర్యావరణ హితము ప్లాస్టిక్ పేపర్ ప్లేట్, ప్లాస్టిక్ గ్లాసుల బదులు స్టీల్ ప్లేట్, స్టీల్ గ్లాసులు. భక్తులు పూజా సామాగ్రి బట్ట సంచులు వాడి ఆలయ పరిసరాలు పరిశుభ్రముగాఉంచాలి అన్నారు. దాతలు బ్రహ్మానాయుడు, సురేష్, వెంకటస్వామి, రాహుల్, శ్రీకాంత్,



ఆలయ కమిటీ అమరేందర్ రెడ్డి, మల్లికార్జునెడ్డి, రవీంద్రావు, శశి కుమార్, గంగాధర్, నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

# వడ్డెర కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, జులై 01 (నినాదం):** ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ వడ్డెర కాలనీలో నెలకొన్న సమస్యలను అతి త్వరలో పరిష్కరించడం జరుగుతుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. బుధవారం ఉదయం స్థానిక మున్సిపల్ చైర్మన్ సుమలత, కమిషనర్ వెంకట కిషన్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్లతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీ ప్రజలతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సిసి రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, ఇంటి నంబర్ల అంశంలో ఇబ్బందులు ఎదుర్కొంటామని వారు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ తరఫున ప్రత్యేక నిధులు కేటాయించి అతి త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కాలనీలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కాలనీలో నూతనంగా నిర్మించిన మునీశ్వర ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆరవ వార్డు పరిధిలోని ఎస్వి



హోమ్స్ కాలనీలో మిషన్ భగీరథ పైప్లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కౌన్సిలర్ పాండు, నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులు, వెంకటేష్, కిషోర్ రెడ్డి, రాహుల్ రెడ్డి, గద్దె రాజు, నవీన్ రెడ్డి, లత, కో ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, బాబా, బండ రాజు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అల్వాల్ పీహెచ్‌సీ వద్ద ఉద్యమకారుల ఆందోళన

డీఎంహెచ్‌వో ఉమాగౌరిని

సస్పెండ్ చేయాలని డిమాండ్

**అల్వాల్, జులై 1(నినాదం):** అల్వాల్ సర్కిల్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు ఆలస్యంగా వస్తున్నారన్న ఫిర్యాదులతో డీఎంహెచ్‌వో ఉమాగౌరి సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు సురేందర్ రెడ్డి సిబ్బంది కొరత, డాక్టర్లు సమయానికి రాకపోవడంపై డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. హాస్పిటల్ గురించి మాకు అన్నీ తెలుసు. మీరు ఎవరు చెప్పడానికి అని అన్నారని ఉద్ధమకారులు ఆరోపించారు. ఎవరికి చెప్పుతారు చెప్పుకోండిఅని దుయ్య పట్టారని ఆరోపించారు. కోదండరాం, కేసీఆర్ తెలియదు. కలెక్టర్ మాత్రమే తెలుసు. మా హాస్పిటల్ మా ఇష్టం. ఏం చేయాలో మేం చేస్తాం అని డీఎంహెచ్‌వో దురుసుగా సమాధానం ఇచ్చారని పట్లోళ్ల సురేందర్ రెడ్డి ఆరోపించారు.



ఉద్యమ నాయకుడు కోదండరాంను అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు, ఉద్యమకారులు బుధవారం పీహెచ్‌సీ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను అవమానించిన డీఎంహెచ్‌వో ఉమాగౌరిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులు కృష్ణ, డోలి రమేష్, మంద శోభన్ బాబు, సంతోష్, రాము, ఉద్యమకారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలి






- తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్
- మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

**మల్కాజిగిరి, జులై 1(నినాదం):** మల్కాజిగిరి జిహెచ్ఎంసి పరిదిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు డబుల్ బెడ్రూమ్ ఇల్లు ఇవ్వాలని బుధవారం మల్కాజిగిరి మండల కార్యాలయం వద్ద యూనియన్ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఉఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ మల్కాజిగిరి జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో రాత్రి, పగలు శ్రమిస్తూ, ప్రజారోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ కార్మికులు, ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులలో అత్యధిక శాతం మంది నిరుపేదలు, వీరు సొంత ఇల్లు లేక అద్దె ఇండ్లలో ఉంటూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కార్మికుల గృహ వసతి సమస్యను పరిష్కరించడానికి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కేటాయించవలసిందిగా కోరుతూ ఇప్పటికే ప్రభుత్వానికి తగిన దరఖాస్తులను ఇవ్వడం జరిగిందని, దయచేసి మా దరఖాస్తులను మానవతా దృక్పథంతో పరిశీలించి, అర్హులైన మున్సిపల్ కార్మికులందరికీ త్వరగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కేటాయించవలసిందిగా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి కె ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో మున్సిపల్ కార్మికులు పనిచేశారని, కానీ ఇప్పటివరకు వారికి ఇస్తామన్న డబ్బులు ఇవ్వలేదని, ఇప్పుడు ఉదయం ఐదు గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు చేయమని చెప్తున్నారని, ఉదయం ఐదు గంటలకు తినకుండా వచ్చి టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టిఫిన్ ఇవన్నీ ఎవరు ఏర్పాటు చేస్తారని అధికారులను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బి ఎల్ లో డ్యూటీ పేరు మీద కార్మికులను వేధిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని, మానుకపోతే పోరాట ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకురాలు అనురాధ, అంజమ్మ, కృష్ణ, ఎల్లయ్య, పద్మ, మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# మందకృష్ణ మాదిగ పిలుపుతో గో టు విలేజ్



**పటాన్చెరు, జులై 1(నినాదం):** భానూరు గ్రామం లోమాదిగ విద్యార్థులతో బండ రాజు అధ్యక్షతన సమావేశం లో పొట్టోళ్ల వెంకటేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, పటాన్చెరు నియోజకవర్గం ఇంచార్జ్ హాజరై మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అడుగు జాడల్లో, 32 సమ్మత్సరాలుగా సుదీర్ఘమైన పోరాటం ద్వారా మ నం సాధించుకున్న వాషి వర్గీకరణ పలాలను మన మాదిగ విద్యార్థులు, యువత పూర్తిగా వినియోగించు కోవాలి. తెలంగాణ రాష్ట్రములో లో నే అత్యదిక జనాభ కలిగిన మనం, విద్య మరియు ఉద్యోగ రంగాలలో వెనుక బడి వున్నాము. అందుకే ప్రతి ఒక్కరు డ్రాపౌట్ కాకుండా ఉన్నత చదువులు అభ్యసిశీ చి, ఉన్నత ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా సామాజికంగా ఎదగాలి. విద్యరంగంలో ముందడుగు వేస్తూనే, భవిష్యత్‌లో రాజ్యాధికారం దిశ గా అడుగులు వేయాల్సిన బాధ్యత మన యువత పై ఉంది. ఈ ఆశయాల సాధన కోసం, జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పటాన్చెరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆత్మ గౌరవ జెండాను ఎగూర వేసి ఈ దినోత్సవాని ఒక పండుగ ల ఘనముగా జరుపుకుందామని, మన జాతి భవిష్యత్ నిర్మాణానికి యువత అంతా ఈ ఉద్యమం లో భాగస్వములు కావాలని పిలుపు నిస్తున్నాము. ఈ కార్యక్రమంలో శంకరూమాదిగ. సదానందం ప్రసిడెంట్ బానూర్ ఉపేందర్ వాయిస్ ప్రసిడెంట్ సాయినాథ్ . శేఖర్ మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్ ఓటర్ మ్యాపింగ్‌ను పర్యవేక్షించిన కూన శ్రీనివాస్ గౌడ్



**కుత్బుల్లాపూర్, జులై 1 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ సర్కిల్ రొడా మేస్త్రి నగర్ డివిజన్, శ్రీరామ్ నగర్‌లో జరుగుతున్న సర్ ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని మేడ్చల్ డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ఓటర్లతో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమం ప్రతి ఓటరికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఓటర్లందరూ తమ వ్యక్తిగత వివరాలను ఎన్యూమరేషన్ దరఖాస్తు ఫారంలో సక్రమంగా నమోదు చేసుకుని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ ఈ నెల 24వ తేదీ వరకు నిరంతరంగా కొనసాగనున్నందున, ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుచ్చి రెడ్డి తో పాటు గుమస్తా మధుసూదన్, వెంకటేష్, బాలకృష్ణ, బలరాం, రఘు రెడ్డి, ఆసిఫ్, నరేష్, దత్తు, రజాక్, రాజిరెడ్డి, పాషా, రామకృష్ణ, రామ నరసయ్య, సంతోష్ తదితరులు, బీఎల్వోలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




## పారమిత విద్యాసంస్థల్లో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

వైద్యుల సేవలు సమాజానికి అమూల్యమని కొనియాడిన పారమిత విద్యాసంస్థల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు

**కరీంనగర్, జులై1(నినాదం)**

కరీంనగర్‌లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్, మంకమ్మతోట పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలల్లో బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌కు చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొని విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ, వైద్య వృత్తి గొప్పతనం గురించి విలువైన సూచనలు చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని రక్షించడం వైద్యుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు మాట్లాడుతూ, వైద్యులను దేవునితో సమానంగా భావిస్తూ పూర్వికులు "వైద్యో నారాయణో హరి:" అని అభివర్ణించారని అన్నారు. రోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ వారి ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమించే వైద్యులు నిజమైన దైవ స్వరూపులని కొనియాడారు. అనంతరం వైద్యులను ఘనంగా సన్మానించి, జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వినోద్ రావు, వి.యు.యం. ప్రసాద్, హన్మంతరావు, ప్రిన్సిపాల్స్ గోపీకృష్ణ, ప్రశాంత్, కవిత ప్రసాద్, సమన్వయకర్తలు నాగరాజు, రాము, కీర్తన, నాజిష్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మేడిగడ్డ నీటిని తరలించకపోవడం దుర్మార్గం

కేసులకు భయపడొద్దు... మా ప్రభుత్వం రాగానే అక్రమ కేసులు ఎత్తివేస్తాం మాజీ మంత్రి గంగుల కమలాకర్

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

**కరీంనగర్, జులై 1(నినాదం)**

బీఆర్ఎస్ కరీంనగర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. జిల్లా కేంద్రంలోని కొండా సత్యలక్ష్మి వేదికలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేసిన హరీశ్‌రావు, కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించారని అన్నారు. మేడిగడ్డ నుంచి నీటిని తరలించే అవకాశం ఉన్నప్పటికీ రాజకీయ కారణాలతో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రైతులకు మేలు చేయకుండా కేసీఆర్‌పై విమర్శలు చేయడం సరికాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, తనను నాలుగుసార్లు గెలిపించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గ అభివృద్ధి నిలిచిపోయిందని విమర్శించారు. తన



శిబిర కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న తమపై క్రిమినల్ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని, పార్టీ కార్యకర్తలు కూడా ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమ కేసులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.రానున్న ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితా ప్రత్యేక సమీక్ష ప్రక్రియలో పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. ఓట్ల



తొలగింపుకు అవకాశం లేకుండా ప్రతి దశను క్షుణ్ణంగా పరిశీలించాలని పార్టీ శ్రేణులకు ఆదేశించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, మాజీ టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, తుల ఉమ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, పొన్నం అనిల్ కుమార్ గౌడ్, సర్దార్ రవీందర్‌సింగ్, చల్ల హరిశంకర్‌తో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## లెంకలపల్లి శరత్ కుమార్‌కు గాండ్ల కుల సంఘం ఘన సన్మానం

**జమ్మికుంట, జూలై 1 (నినాదం)**

జమ్మికుంట పట్టణ ఆర్య వైశ్య నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన లెంకలపల్లి శరత్ కుమార్‌ను బుధవారం జమ్మికుంట గాండ్ల కుల సంఘం ఆధ్వర్యంలో శరత్ కుమార్‌కు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాండ్ల కుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ... లెంకలపల్లి శరత్ కుమార్ ఆర్య వైశ్య పట్టణ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం హర్షణీయమని, ఆయన నాయకత్వంలో ఆర్యవైశ్య సంఘం మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉంటూ జమ్మికుంట పట్టణ అభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. తమపై నమ్మకంతో సన్మానించినందుకు గాండ్ల కుల సంఘం నాయకులకు, సభ్యులకు శరత్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో గాండ్ల కుల అధ్యక్షుడు వెన్నంపల్లి విఠల్, మండల అధ్యక్షుడు పోతునూరి శ్రీశైలం,గాండ్ల కులస్తులు పిల్లలమర్రి రవి,సంద శ్రీనివాస్, వెన్నంపల్లి పవన్ కుమార్, వెన్నంపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఔదార్యం

పూర్వ పాఠశాలకు పోర్టబుల్ సౌండ్ సిస్టం వితరణ

**జమ్మికుంట, జూలై 1 (నినాదం)**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీణవంకలో 2009 నుండి2023 వరకు 14 సంవత్సరాల పాటు పనిచేసి బదిలీపై జెడ్ పి హెచ్ ఎస్ బాయ్స్ జమ్మికుంటకు బదిలీపై వెళ్లిన మ్యాకమల్ల శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ తను పనిచేసిన పూర్వ పాఠశాలకు 12000 రూపాయల విలువైన పోర్టబుల్ సౌండ్ సిస్టం ను అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.సౌండ్ సిస్టం ను జిల్లా విద్యాధికారి ఎన్ ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు పులి అశోక్ రెడ్డికి అందించారు. గణిత ఉపాధ్యాయునిగా బోధనతోపాటు ఎన్సీసీ ఆఫీసర్ గా,ఫిజికల్ డైరెక్టర్ పోస్ట్ ఖాళీగా ఉన్న సమయంలో అట్టి బాధ్యతలను కూడా నిర్వర్తించినట్లు హెచ్ఎం తెలుపగా జిల్లా విద్యాధికారి ఉపాధ్యాయుడు శ్రీనివాస్ సేవలను అభినందించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముల్కల విజయ్ కుమార్ మాట్లాడుతూ గతంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన విద్యార్థుల కోసం విరాళాలు సేకరించి వారి పేరున



ఫిక్స్డ్ డిపాజిట్ చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు.ఎన్సిసి ఆఫీసర్ గా విద్యార్థుల్లో క్రమశిక్షణ,దేశభక్తిని పెంపొందించడంతోపాటు సోషల్ సర్వీస్ కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసి విద్యార్థుల్లో సామాజిక స్పృహ,చైతన్యాన్ని, సేవా భావాన్ని పెంపొందించేందుకై అహర్నిశలు కృషి చేశారని ప్రశంసించారు.ఇట్టి కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.



## లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం

**బుగ్గారం, జూలై 1(నినాదం )**

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలోని బీర్సాని గ్రామంలో పశువులను లంపి స్కిన్ డిసీజ్ నుంచి రక్షించేందుకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని డా.తిరుపతి విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని అర్హత కలిగిన125 పశువులకు టీకాలు వేశారు. అనంతరం పాడి రైతులకు లంపి స్కిన్ వ్యాధి లక్షణాలు,నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశువైద్య అధికారులను సంప్రదించాలని సూచించారు. టీకాల కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ ప్రశాంత్‌తో పాటు సిబ్బంది మనోజ్, గౌస్, కుమారస్వామి, సుల్తానా పాల్గొని కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కారుకూరి శరణ్య చంద్రశేఖర్ పాల్గొని కార్యక్రమానికి సహకారం అందించగా, పలువురు పాడి రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, లంపి స్కిన్ వ్యాధి నివారణకు ప్రతి అర్హత కలిగిన పశువుకు తప్పనిసరిగా టీకా వేయించాలని, పశువుల ఆరోగ్య పరిరక్షణ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



## సిద్దిపేట సురక్ష నేత్రతో గ్రామాల్లో భద్రత మరింత పటిష్ఠం

రామవరం గ్రామంలో 10 నూతన సీసీ కెమెరాల ప్రారంభం

**హుస్నాబాద్ జులై 1 (నినాదం):**

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, IPS ఆధ్వర్యంలో చేపట్టిన "సిద్దిపేట సురక్ష నేత్ర" కార్యక్రమంలో భాగంగా అక్కన్నపేట మండల పరిధిలోని రామవరం గ్రామంలో ఏర్పాటు చేసిన 10 నూతన సీసీ కెమెరాలను హుస్నాబాద్ ఏసీపీ ఎస్. సదానందం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సీహెచ్. ప్రశాంత్, మండల అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ ఎస్. సదానందం మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నేరాలను నిరోధించడంలోనే కాకుండా, నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో సీసీ కెమెరాలు సమర్థవంతమైన సాధనంగా ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించిన వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాలు, కాలనీలు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. సిద్దిపేట సురక్ష నేత్ర" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఏసీపీ ఎస్. సదానందం విజ్ఞప్తి చేశారు. గ్రామాల భద్రత కోసం ప్రజలు–పోలీసులు సమన్వయంతో పనిచేస్తే నేరాలను మరింత సమర్థంగా అరికట్టవచ్చని అన్నారు.

## రైతు భరోసాతో రైతుల కళ్ళల్లో ఆనందం

వ్యవసాయం దండగ కాదు పండగ... ప్రణవ్

రైతు పెట్టుబడికి భరోసా నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

**జమ్మికుంట, జూలై 1 (నినాదం)**



రైతులు దుక్కిదున్ని నాట్లు వేసే ముందు తెలంగాణ రైతాంగానికి రైతు భరోసా ద్వారా నిధులు సమకూర్చి వారికి భరోసా కల్పించామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.మంగళవారం నాడు శిల్పారామం వేదిక ద్వారా వానకాలం పెట్టుబడికి సంబంధించి 73.32మంది రైతులకు 8,835.23 కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం జమ చేసిందని పేర్కొన్నారు.ఈ పెట్టుబడి సాయం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని గత వానకాలం సీజన్ లాగానే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రైతు ప్రభుత్వమని,రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెట్టుబడి సాయంతో పాటు సన్నవడ్లు పండించిన రైతులకు బోనస్ కూడా ఇస్తుందని తెలిపారు.ఎల్ నీ లో ప్రభావం ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారని దానికి తగ్గట్టు రైతులు ప్రత్యమ్నాయ పంటలవైపు సాగు చేసుకోవాలని సూచించారు.

**రైతు భరోసాతో పాటు "సన్నాల"కు బోనస్**

రైతులకు రైతుబంధు సన్నబడ్లకు 500 రూపాయలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ప్రణవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని రాష్ట్రంలో వ్యవసాయం చేసుకునే రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందని వారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. రైతుల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుక్షణం ఆలోచిస్తాడని రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని వ్యవసాయం పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని ప్రణవ్ తెలిపారు. తెలంగాణ రైతులకు పంటల సమయంలో రైతు భరోసా నిధులు విడుదల చేసిన ప్రభుత్వానికి ప్రణవ్ కృతజ్ఞతలు తెలిపారు.



## రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు

**కరీంనగర్, జులై1(నినాదం)**

విద్యార్థులకు కంటి పరీక్షలు, విద్యా సామగ్రి పంపిణీ.. ఉపాధ్యాయులకు బట్ట సంచులు, పాఠశాలలో మొక్కల నాటకం.కరీంనగర్‌లోని రాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో "పర్యావరణ పరిరక్షణ ప్రజల బాధ్యత" అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులకు కంపాస్ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, చాక్లెట్లు పంపిణీ చేయడంతో పాటు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే లక్ష్యంతో ఉపాధ్యాయులకు బట్ట సంచులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే సమాజ సేవలో భాగంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను చీరలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు శివకాంత్, కార్యదర్శి బట్టు వినోద్, ఖజాంచి మెతుకు కృష్ణచైతన్య, సభ్యుడు లంబు సుధాకర్ రెడ్డి, బీజేపీ నాయకులు వంగల రవిగోపాల్, అప్పాల శ్రీనివాస్, మల్లేశం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో గొప్పది..!

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం: హుస్నాబాద్ ఏసీపీ సదానందం







**హుస్నాబాద్ జూలై 1 (నినాదం):**

సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాలనుసారం నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఒక నెల వ్యవధిలో 1,000 సీసీ కెమెరాల ఏర్పాటును పూర్తి చేసినట్లు హుస్నాబాద్ ఏసీపీ సదానందం తెలిపారు.హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామంలో బుధవారం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన 8 సోలార్ ఆధారిత 360 డిగ్రీల హై-రిజల్యూషన్ సీసీ కెమెరాలను ఏసీపీ సదానందం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పరిస్థితుల్లో నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. గతంలో దొంగతనాలు లేదా ఇతర నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు ఎక్కువ సమయం పట్టేదని, ప్రస్తుతం సీసీ కెమెరాల సహాయంతో నిందితులను వేగంగా గుర్తించి చట్టం ముందు నిలబెట్టడం సాధ్యమవుతోందని తెలిపారు. ప్రస్తుతం కొందరు ఈజీ మనీ కోసం నేరాలకు పాల్పడుతున్నారని, సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరం చేయాలనే ఆలోచన కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. "ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఉంటే నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చు" అని అన్నారు.సీసీ కెమెరాలు కేవలం నేరాలను ఛేదించడానికే కాకుండా, నేరాలను ముందుగానే నిరోధించడంలో, ప్రమాదాల దర్యాప్తులో, ప్రజా ఆస్తుల రక్షణలో, మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రతి గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ పోలు సంపత్ మాట్లాడుతూ, గాంధీనగర్ గ్రామంలో ఆధునిక సీసీ కెమెరాల ఏర్పాటు గ్రామ భద్రతకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడంలో ఇవి కీలకంగా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మారెడ్డి, పోలీసు సిబ్బంది, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మాలపల్లిలో సీసీ కెమెరాలతో భద్రత మరింత పటిష్ఠం

దాతల సహకారంతో గ్రామంలో ఆధునిక నిఘా వ్యవస్థ ఏర్పాటు





**హుస్నాబాద్ జులై 1 (నినాదం)**


గ్రామ భద్రతను మరింత పటిష్ఠం చేయాలనే లక్ష్యంతో మాలపల్లి గ్రామంలో దాతల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత ఆధ్వర్యంలో చేపట్టారు. హుస్నాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో నలుదిక్కుల నుంచి జరిగే రాకపోకలను పర్యవేక్షించేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెన్న స్వర్ణలత మాట్లాడుతూ, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రజల్లో భద్రతపై మరింత భరోసా పెరుగుతుందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, భద్రమైన గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బంక చందు, ఉప సర్పంచ్ బత్తుల శ్రీనివాస్, వార్డు సభ్యులు బత్తుల వీరస్వామి, గుండాల ప్రశాంత్, బత్తుల కవిత, వెన్న శారద, పాఠశాల హెచ్ఎం సతీష్, సరస్వతి దేవి, సీఏ వెన్న శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు గొల్ల రవితేజ, ఫీల్డ్ అసిస్టెంట్ బత్తుల రేణుక, ఆశా వర్కర్ వెన్న రాజేశ్వరి, రేషన్ డీలర్ బత్తుల సునీత, ఉపాధి హామీ మేట్ బత్తుల రాణి, వెన్న రాజు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ పాఠశాలలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

వైద్యుల సేవలకు ఘన నివాళి... వైద్యులైన పూర్వ విద్యార్థులకు సన్మానం

**కరీంనగర్, జులై1(నినాదం)**

కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వివిఎన్నార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో వైద్యుల పాత్ర అమూల్యమని అన్నారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేందుకు వైద్యులు నిరంతరం సేవలందిస్తూ సమాజానికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు ప్రముఖ వైద్యుడు డాక్టర్ బి.సి. రాయ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకు




న్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించడం వైద్య వృత్తి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. వైద్యులు తమ సేవా తత్వంతో ప్రాణాలను కాపాడుతూ సమాజంలో విశేష గౌరవం పొందుతున్నారని, వారి త్యాగం వెలకట్టలేనిదని డాక్టర్ నరేందర్ రెడ్డి అన్నారు. అందుకే వారిని ప్రాణరక్షకులు, ముందువరుస యోధులుగా గుర్తిస్తారని చెప్పారు.ఈ సందర్భంగా అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో పదో తరగతి చదివి ప్రస్తుతం వైద్య విద్య పూర్తి చేసి వైద్యులుగా ఎదిగిన పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్ల సేవల విశిష్టతను చాటి చెప్పే సాంస్కృతిక ప్రదర్శనలు, నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు "ఆకుల"కు ఘన సన్మానం

రాజేందర్ రాజకీయంగా ఎదగాలి...

మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం నాయకులు

**జమ్మికుంట, జూలై 1 (నినాదం)**

కరీంనగర్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆకుల రాజేందర్‌ను జమ్మికుంట మండల మున్నూరు కాపు జర్నలిస్టులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఎబూషి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆకుల రాజేందర్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడని అన్నారు. బీసీ వర్గాల సమస్యలను నిరంతరం ప్రస్తావిస్తూ వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తున్న ఆయనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ పదవిలో ఆయన మరింత సమర్థవంతంగా పనిచేసి జిల్లాలోని బీసీ వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం జిల్లా నాయకులు పంతాటి రవీందర్ మాట్లాడుతూ, ఆకుల రాజేందర్ సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ప్రజల మధ్య పనిచేస్తూ ఈ స్థాయికి ఎదిగారని తెలిపారు. పార్టీ ఆయనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బీసీల సంక్షేమం, యువత అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం మరింతగా శ్రమిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లాలో బీసీలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సన్మానానికి



స్పందించిన ఆకుల రాజేందర్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ వర్గాల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, యువతకు అవకాశాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. మున్నూరు కాపు జర్నలిస్టులు అందించిన ఈ సన్మానం తనకు మరింత బాధ్యతను పెంచిందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జర్నలిస్టులు ఎబూషి శ్రీనివాస్, పంతాటి రవీందర్, దాట్ల శ్రీనివాస్, కోలకాని రాజేందర్, ఎబూషి సంపత్ తదితరులు పాల్గొని ఆకుల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేదల ముంగిట్లోకి అత్యాధునిక వైద్య సేవలు

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**భూపాలపల్లి ప్రతినిధి, జూలై 1(నినాదం):** పేద ప్రజల ముంగిట్లోకి అత్యాధునిక వైద్య సేవలు ఉచితంగా అందుబాటులో తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఎమ్ఆర్ఐ యంత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంయుక్తంగా ప్రారంభించారు. కంప్యూటర్ స్విచ్ ఆన్ చేసి యంత్రాన్ని ప్రారంభించిన అనంతరం యంత్రం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ మారుమూల జిల్లాగా ఉన్న జయశంకర్ భూపాలపల్లిలో అత్యాధునిక ఎమ్మారై సేవలు ప్రారంభం కావడం ఎంతో సంతోషకరమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి వరంగల్, హైదరాబాద్ వంటి నగరాల్లో లభించే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది ఆస్పత్రిలో రోగుల అవసరాల కోసం వెంటిలేటర్లు, సీటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఆస్పత్రిని 100 పడకల నుంచి 300 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో పాటు రూ.14 కోట్ల వ్యయంతో నాలుగో అంతస్తు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే గుండె సంబంధిత చికిత్సల కోసం క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తరహాలో ఇతర బ్యాంకులు కూడా తమ సిఎస్ఆర్ నిధులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలు కూడా ఈ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. సీటీ స్కాన్, ఎమ్మారై స్కాన్ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, "డాక్టర్స్ ఫర్ యూ" సంస్థ ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంజీఎం ఆసుపత్రి తర్వాత ప్రభుత్వ రంగంలో ఎమ్మారై యంత్రం ఏర్పాటు చేసిన ఆసుపత్రిగా భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిలవడం గర్వకారణమన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఎమ్మారై సేవల నిర్వహణ కోసం ఇద్దరు నిపుణులైన ఆపరేటర్లను నియమించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో రోగులను హైదరాబాద్, హనుమకొండకు తరలించాల్సి వచ్చేదని, ఇకపై భూపాలపల్లిలోనే ఉచిత ఎమ్మారై పరీక్షలు అందుబాటులో ఉండడంతో ప్రజలకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. ఆస్పత్రికి ఎమ్మారై యంత్రాన్ని అందించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులను ఎమ్మెల్యే, కలెక్టర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, హెచ్ డి ఎఫ్ సి క్లస్టర్ హెడ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేసిన ఎస్పీ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జిల్లాలో పోలీసు సేవలను మరింత మెరుగుపర్చే దిశగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, బుధవారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా పనిచేయాలని సిబ్బందికి ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మరిపెడ పాఠశాలలో సమగ్ర శిక్ష సామాజిక తనిఖీ



**డోర్నకల్ /మరిపెడ జులై 01 (నినాదం):** సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ ఆధ్వర్యంలో గాదెగాని అరుణ పర్యవేక్షణలో ఈరోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మరిపెడలో సమగ్ర శిక్ష సామాజిక తనిఖీ ( సోషల్ ఆడిట్ ) విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన పరిపాలనా రికార్డులు, విడుదలైన వివిధ గ్రాంట్ల వినియోగం, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అలాగే విద్యార్థుల నమోదు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ,మధ్యాహ్న భోజన పథకం అమలు, మరుగుదొడ్ల నిర్వహణ, ఆట స్థలం వినియోగం, గ్రంథాలయ సేవలు, విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల నిర్వహణ,పాఠశాల నిర్వహణ కమిటీల పనితీరు,బోధనోపకరణాల వినియోగం, డిజిటల్ బోధన, విద్యా ప్రమాణాలు తదితర అంశాలపై సమగ్రంగా సామాజిక తనిఖీ చేపట్టారు. తనిఖీ ప్రక్రియలో వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు,పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రత్యక్షంగా సమావేశమై పాఠశాల నిర్వహణ,బోధన,సౌకర్యాలు మరియు ప్రభుత్వ పథకాల అమలుపై వారి అభిప్రాయాలను తెలుసుకొని పలు అంశాలపై పరిశీలన నిర్వహించారు. తనిఖీ అనంతరం పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాలు,ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత,విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు,ఉపాధ్యాయుల సేవల పట్ల సామాజిక తనిఖీ బృందం పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసింది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాల సమర్థవంతంగా నిర్వహించబడుతున్నట్లు ప్రశంసించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు, ఉపాధ్యాయ బృందం,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌ఓ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

### ఆరోగ్యశాఖ మంత్రికి ఎమ్మెల్యే నాయిని ఫోన్

### ఉద్యోగుల వినతిపై స్పందించిన ఎమ్మెల్యే



**హనుమకొండ, జూలై 1,(నినాదం):** హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నెలకొన్న పరిస్థితులపై వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పందించారు. తక్షణమే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో ఫోన్‌లో మాట్లాడి, జిల్లా డీఎంహెచ్‌ఓ వ్యవహారంపై తగిన విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీఎన్‌జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ నాయకత్వంలో జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. డీఎంహెచ్‌ఓ వ్యవహార శైలి కారణంగా వైద్య ఆరోగ్యశాఖలోని ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వారు ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. ఉద్యోగుల విన్నపాన్ని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే సమస్య తీవ్రతను వెంటనే గుర్తించి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో మాట్లాడారు. ఉద్యోగులు వ్యక్తం చేసిన ఆందోళనలను మంత్రికి వివరించి, అంశాన్ని ప్రాధాన్యతతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు పరస్పర గౌరవం, సానుకూల వాతావరణంలో విధులు నిర్వహించే పరిస్థితులు ఉండాలని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధిగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. శాసన మండలి సభ్యులు బస్వారాజు సారయ్య కూడా ఉన్నారు. ఈసందర్భంగా టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్ మోహన్ రావు, ప్రభుత్వ వైద్యుల సంఘం (జీడీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కృష్ణా కృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రాజిరెడ్డి, ఏఓ కోలా రాజేష్, సీహెచ్ ఓ రాష్ట్ర అధ్యక్షులు నెహ్రు చందు,యాదా నాయక్, సుధాకర్‌తో పాటు టీఎన్‌జీఓ, టీజీఓ, ప్రభుత్వ వైద్యుల సంఘం ఆరోగ్యశాఖ ఎస్సీ, ఎస్టీ సంఘాలు మరియు వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన అదనపు కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జె. జీవన్ కుమార్‌ను జిల్లా అదనపు కలెక్టర్ ఎల్. విజయలక్ష్మి, అదనపు ఎస్పీ ఏ.నరేష్ కుమార్ భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్ రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలకు సమర్థవంతమైన న్యాయ సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ పలు అంశాలపై వారు చర్చించారు.

## కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



**హనుమకొండ: జులై1, (నినాదం):** వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేతను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయడానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ప్రేమకరణ్‌రెడ్డి



**నలగొండ ప్రతినిధి, జూలై 1(నినాదం):** నల్గొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా నంద్యాల ప్రేమ్ కరణ్ రెడ్డి ఈరోజు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు నల్గొండ ఆర్డీవో యారాల అశోక్ రెడ్డి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండగా ఆయన స్థానంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారిగా పనిచేస్తున్న ప్రేమ్ కిరణ్ రెడ్డికి అదనంగా బాధ్యతలు అప్పగించారు. స్థానిక సంస్థల మీద లోతైన అవగాహన ఉన్న ప్రేమ కరణ్ రెడ్డికి బాధ్యతలు అప్పగించడం వల్ల స్థానిక సంస్థల్లో పనులు వేగవంతం కానున్నాయి.

## సర్ జాబితాను తప్పులు లేకుండా చేయాలి

### జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి జులై 1 (నినాదం):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలలో వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బి ఎల్ ఓ లను ఆదేశించారు. బుధవారం అయన నల్గొండ జిల్లా, గట్టుప్పల్ మండల కేంద్రంలో "సర్" కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. బిఎల్ ఓలు ఇంటింటికి వెళ్లి నిర్వహిస్తున్న సర్ ను ప్రత్యక్షంగా పరిశీలించారు. బిఎల్వోలు ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు ఇవ్వడం, వాటిలో వివరాల నమోదు ను తనిఖీ చేశారు. 2002లో ఓటరు వివరాలున్నట్లయితే ఇప్పుడు ఎన్యుమరేషన్ ఫారంలో ఎలాంటి వివరాలు నమోదు చేస్తున్నారు ? లేనట్లయితే ఎలాంటి వివరాలు పొందుపరచాలో అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న ఇంటి యజమాని గుమ్మకొండ నర్సిరెడ్డి యాదిరెడ్డి తో మాట్లాడుతూ మీ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయని? ఎంతమంది ఉన్నారని? ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇచ్చారా? వాటిని నింపారా? ఏ పోలింగ్ కేంద్రంలో మీకు ఓట్లు ఉన్నాయి? అని అడిగారు. ఒక కుటుంబం మొత్తం ఒక పోలింగ్ కేంద్రంలోకి వచ్చేలా చూడాలని, బిఎల్వోలు ఇల్లిల్లు సందర్శించే సమయంలోనే ఫామ్ -6, 8 వెంటబెట్టుకుని వెళ్లాలని చెప్పారు. ఒక ఓటరుకు రెండుచోట్ల ఓటు నమోదు ఉన్నట్లయితే ప్రస్తుతం తనకు ఓటు ఎక్కడ ఉండాలో ఓటరే నిర్ణయించుకోవాలని, లేనట్లయితే అధికారులే రికార్డుల ఆధారంగా ఒక చోట తొలగించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎవరికీ రెండుచోట్ల ఓటు హక్కు ఉండరాదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంలో బిఎల్ఓ లకు సహకారం అందించాలని, ఈ విషయమై పంచాయతీ కార్యదర్శులు బిఎల్వోలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేసి తెలియజేయాలని ఎం పి డి ఓ హిమబిందును ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపిన తర్వాత ఓటరు జాబితా ప్రదర్శన, కొత్త ఓటు నమోదు ,తప్పులను సరి చేయడం వంటివి చేపట్టడం జరుగుతుందని, అందువల్ల ఓటర్లు త్వరితగతిన వారి వివరాలను సమర్పించి ఎన్యుమరేషన్ ఫామ్స్ ప్రక్రియను పూర్తిచేసేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్ లో ఏమైనా సందేహాలు ఉన్నాయా? అని అడిగారు. హైదరాబాదు నుండి గట్టుప్పల్ కు ఓటును ట్రాన్స్ఫర్ చేసుకోవడం గురించి వారు జిల్లా కలెక్టర్ తో సందేహాలను నివృత్తి చేసుకున్నారు. బి ఎల్ ఏ లు అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కలెక్టర్ తహసిల్దార్ రాములు ను ఆదేశించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ ఇదే మండలం, వెలమకన్నెలో రావుల సత్యం ఇంటి వద్ద ఎన్యుమరేషన్ జరుగుతుండగా అక్కడికి వెళ్లి ఇంట్లో ఎవరెవరు ఉంటారని ఎంతమంది ఓటర్లు ఉన్నారని అందరిదీ ఒకే పోలింగ్ కేంద్రంలోనే ఓటు ఉందా? అని అడిగారు. బిఎల్ఓతో మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్ని ఎన్యూమరేషన్ ఫామ్స్ ఇచ్చారని? ఇచ్చిన వారందరూ తిరిగి ఇచ్చారా? 100% ఫార్మ్స్ డిస్ట్రిబ్యూషన్ పూర్తయిందా? ఇంకా ఎవరైనా మిగిలి ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. కాగా తను అంగన్వాడీ కార్యకర్తగా పని చేస్తున్నానని తెలుపగా రెండు పనులను ఏలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని, అంతే కాకుండా తప్పులు లేకుండా ఫామ్స్ నింపాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట చండూర్ ఆర్డీవో శ్రీదేవి, సర్పంచ్ ఎం .జగన్నాథం తదితరులు ఉన్నారు.

## హైదరాబాద్‌లో కాదు.. నియోజకవర్గంలో ఉండాలి

### మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

### నియోజకవర్గ సమస్యలపై బొల్లం ప్రశ్నల వర్షం

### పోలీసు ఖాళీలు, నిధుల వివక్షపై బొల్లం విమర్శలు



**మోతే ,జూలై 1(నినాదం):** హైదరాబాద్‌లో కాదు... నియోజకవర్గంలోనే ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని స్థానిక ఎమ్మెల్యేకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సూచించారు. బుధవారం మోతె మండలంలోని హుస్సేనా బాధ గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎమ్మెల్యేను కలవాలంటే ప్రజలు అద్దె వాహనాలు ఏర్పాటు చేసుకుని హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రజాప్రతినిధి నియోజకవర్గంలోనే ఎక్కువ సమయం గడుపుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కోదాడ నియోజకవర్గంలోని కోదాడ రూరల్ పోలీసు స్టేషన్‌లో సీఐ పోస్టు, అనంతగిరి, మునగాల పోలీసు స్టేషన్లలో ఉప నిరీక్షకుల పోస్టులు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయించి ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందేలా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కోదాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన సర్పంచుల గ్రామాలపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని గ్రామాలకు సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాప్రతినిధుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. అనంతరం హుస్నాబాద్ గ్రామానికి చెందిన కొత్తూరు రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షుడు హలావత్ మదర్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు యాదవ్, మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు ఆరె లింగారెడ్డి, గ్రామ సర్పంచ్ అక్కెనపల్లి శ్రీరాములు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలంటూ ఫెర్టిలైజర్ దుకాణం ఎదుట రైతుల ఆందోళన





**కోదాడ,జూలై 1(నినాదం):** కోదాడ పట్టణంలోని ఓ ఫెర్టిలైజర్ దుకాణంలో కొనుగోలు చేసిన జినెక్స్ సాంబ విత్తనాలు మొలకెత్తలేదని ఆరోపిస్తూ రైతులు గురువారం దుకాణం ఎదుట ఆందోళనకు దిగారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కట్టు కేసారం చెందిన ఆరుగురు రైతులు 15 ఎకరాలకు సరిపడా విత్తనాలను 15 రోజుల క్రితం కొనుగోలు చేశామని, ఇప్పటికీ మొలకలు రాకపోవడంతో దుకాణాన్ని ఆశ్రయించామని తెలిపారు. అయితే దుకాణం నిర్వాహకులు బాధ్యత తీసుకోకుండా వ్యవహరించారని ఆరోపించారు. ఈ సందర్భంగా జినెక్స్ కంపెనీ ప్రతినిధి జానీ పాషా మీడియా ప్రతినిధులతో దురుసుగా ప్రవర్తించినట్లు రైతులు తెలిపారు. అనంతరం జినెక్స్ సాంబ విత్తనాల స్థానంలో చైతన్య సాంబ విత్తనాలు అందజేసినట్లు తెలిపారు. ఘటనపై వ్యవసాయ శాఖ అధికారులకు రైతులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం

### వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి





**హనుమకొండ, జూలై 1 (నినాదం):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ఇందుకు ప్రజలందరి సహకారం ఎంతో అవసరమని వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆమె, ఉదయం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసులు నూతన కమిషనర్ కు వందనం సమర్పించారు. అనంతరం మాజీ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ నుంచి నూతన పోలీస్ కమిషనర్ గాఎన్. శ్వేతా రెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది నూతన పోలీస్ కమిషనర్‌నుమర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, నోట్‌బుక్‌లను సీపీకి అందజేసి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తారని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## ఖానాపురం పంచాయతీ భూమి అప్పగించాలని వినతి



**కోదాడ, జూలై 1(నినాదం):** అనంతగిరి మండలం ఖానాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 50లో ఉన్న ప్రభుత్వ భూమిని తిరిగి ఖానాపురం గ్రామపంచాయతీకి అప్పగించాలని ఉపసర్పంచ్ గింజుపల్లి జగన్ గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ కమలాకర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ భూమిని ఖానాపురం గ్రామపంచాయతీకి ప్రభుత్వం కేటాయించిందని, అయితే కొత్తగా ఏర్పడిన అజ్మీర తండా గ్రామపంచాయతీ ఆ భూమిని ఆక్రమించి లీజుకు ఇచ్చిందని ఆరోపించారు. ఖానాపురం గ్రామపంచాయతీకి భూమి కేటాయించినట్లు నిర్ధారించే అగ్రిమెంట్ పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి భూమిని తిరిగి ఖానాపురం గ్రామపంచాయతీకి అప్పగించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఉయ్యాల వీరయ్య గౌడ్, కంటూ గోపి, పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యులకు షిర్డీ సాయి భక్త ఐక్యవేదిక ఘన సన్మానం





**చింతపల్లి, జూలై 1 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బోర్డు సభ్యులుగా నియమితులైన దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయ మాజీ చైర్మన్ గుండా మల్లయ్య , ప్రశాంత్‌నగర్--వనస్థలిపురం సాయిబాబా ఆలయ చైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్ లను షిర్డీ సాయి భక్త ఐక్యవేదిక ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. షిర్డీ సాయి భక్త ఐక్యవేదిక ట్రస్ట్ సభ్యులైన వీరిద్దరూ యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యులుగా ఎంపిక కావడం పట్ల ట్రస్ట్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు తమ పదవుల్లో విజయవంతంగా సేవలందిస్తూ యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షిర్డీ సాయి భక్త ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు , చింతపల్లి శిరిడి సాయి బాబా ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య , ఆలయ కార్యదర్శి పి.వి. సాయి, హనుమంత్ , ట్రస్ట్ సభ్యులు, సాయి భక్తులు పాల్గొని నూతన బోర్డు సభ్యులను అభినందించారు.

# ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

**కళాశాలలకు అవసరమైన వసతులపై ప్రతిపాదనలు అందించాలి**

**కమాన్ పూర్ లో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలి**

**ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల తనిఖీ, కమాన్పూర్ నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**మంథని జూలై 1(నినాదం):** ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం మంథనిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, బోధనా పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మంథని పట్టణంలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆ తర్వాత కమాన్ పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కళాశాల యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాశాలల్లో అదనపు మౌలిక వసతులు అవసరమైతే సంబంధిత ప్రతిపాదనలు వెంటనే అందజేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్వో) తమ పరిధిలోని ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, వాటిని సక్రమంగా నింపడంలో అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ఓటరు నుంచి తప్పనిసరిగా నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించి, నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కమాన్ పూర్ మండలంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, మిగిలిన రీనోవేషన్, తుదిదశ పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలో కార్యాలయాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, మంథని తహసీల్దార్ అరిఫోద్దిన్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, కమాన్ పూర్ తహసీల్దార్ వాసంతి, ఏఈ పి. ఆర్. జగదీష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కమిషనర్ సార్.. జర దేకో..!

**చినుకు పడితే చిత్తడే**

**పోలీస్ స్టేషన్ రహదారిపై నిత్యం జలకష్టమే**

**ఏళ్లు గడుస్తున్నా శాశ్వత పరిష్కారం కరువు**

**అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**



**సుల్తానాబాద్, జూలై 1 (నినాదం):** సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రం లోని స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి వర్షం పడితే చాలు చెరువును తలపిస్తోంది. స్వల్ప వర్షానికే రోడ్డంతా నీటితో నిండి పోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై నిలిచిపోయే నీటితో బురద, గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధిలో ముందంజలో ఉందని చెప్పుకుంటున్న సుల్తానాబాద్ మున్సిపాలిటీలో ప్రధాన రహదారులే ఇలాంటి దుస్థితికి చేరుకోవడం విచారకరమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నోసార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం చూపకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు, అత్యవసర సేవలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారిని శాశ్వతంగా అభివృద్ధి చేసి ప్రజల సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉప సర్పంచ్‌ల ఫోరానికి కొత్త నాయకత్వం

**ఎలిగేడు మండల అధ్యక్షుడిగా బొడిగె శివకృష్ణగౌడ్ ఏకగ్రీవ ఎన్నిక**





**సుల్తానాబాద్, జూలై 01 (నినాదం):** పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మండల అధ్యక్షుడిగా బొడిగె శివకృష్ణ గౌడ్, ఉపాధ్యక్షురాలిగా పుల్వాల మంగ, ప్రధాన కార్యదర్శిగా పొన్నాల సౌజన్యఅనిల్, కోశాధికారిగా బైరి మల్లేశంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బొడిగె శివకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల ఉప సర్పంచ్‌లతో సమన్వయంగా పనిచేస్తూ గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణతో పాటు వారి బాధ్యతల నిర్వహణలో పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ ఫోరాన్ని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోసిక రవీందర్, బాబు, తీట్ల విద్యాలతవిజయ్, మేచినేని అండాలు, కొత్తిరెడ్డి బాపురెడ్డి, ముత్యాల రమ్య అనిల్, మారం రాయమల్లు తదితర గ్రామాల ఉప సర్పంచ్‌లు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది

# కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మంచిర్యాల అభివృద్ధి



**మంచిర్యాల, జూలై 1(నినాదం) :** కార్పొరేషన్ లో జరుగుతున్న అవినీతి పై విచారణ చేపట్టాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో కార్పొరేషన్ లో జరుగుతున్న అవినీతి పై మరియు సమస్యల పై ప్రశ్నించిన బీజేపీ కార్పొరేటర్ల ను సస్పెండ్ చేయడంతో శాంతియుత నిరసన చేసిన బీజేపీ కార్పొరేటర్ల మరియు బీజేపీ నాయకుల పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ డీసీపీ కార్యాలయం ఎదుట నిరసన చేసి డీసీపీకి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రఘునాథ్ గారు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ జరుగుతున్న అవినీతి మరియు నిధులు దుర్వినియోగం పై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల కార్పొరేషన్ లో పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చెందుతుంది తప్ప రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని అన్నారు. మంచిర్యాల లో నిర్మించిన మహా ప్రస్థానానికి 4 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం నిధులు ఉన్న ఎమ్మెల్యే మాత్రం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టుగా చెప్పుకుంటున్నారని అన్నారు. అదే విధంగా మంచిర్యాల జిల్లాలో ఏడు మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద మంచి నీటి సరఫరా కోసం మరియు చెరువుల అభివృద్ధికి 320 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. మంచిర్యాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు తప్ప రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఏమీ లేవని అన్నారు. కార్పొరేషన్ లో జరుగుతున్న అవినీతి పై తక్షణమే విచారణ చేపట్టాలని అదే విధంగా బీజేపీ కార్పొరేటర్లు మరియు నాయకుల పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యకరమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాజుల ముఖేష్ గౌడ్, కార్పొరేటర్లు కస్తూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# ప్రత్యేక ఓటర్ల సమగ్రసవరణ ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

**కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**



ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు మున్సిపల్, రెవెన్యూ యంత్రాం

**కరీంనగర్, జులై 1(నినాదం) :** కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కోరారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, క్షేత్రస్థాయి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో గం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ఇప్పటి వరకు సుమారు 80 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయ్యిందని, పంపిణీ పూర్తైన ప్రాంతాల్లో బూత్ స్థాయి అధికారులు పూర్తిగా నింపిన దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలని, ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, ద్వంద్వ ఓట్లు, నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్ల తొలగింపులో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.









# సేవే లక్ష్యంగా..

**20 విశిష్ట కార్యక్రమాలతో సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆదర్శం**

**ఆవిర్భావ దినోత్సవాన్ని సేవా సంబరంగా మార్చిన లయన్స్ క్లబ్**

**ఆరోగ్యం, విద్య, పర్యావరణం, సామాజిక సేవల్లో విస్తృత కార్యక్రమాలు**

**సేవా కార్యక్రమాలకు పెట్టింది పేరుగా నిలిచిన సుల్తానా బాద్ లయన్స్ క్లబ్**

**అధ్యక్షుడు డా. జూపల్లి తిరుమలరావు**




**సుల్తానాబాద్, జూలై1 (నినాదం):** సమాజ సేవే పరమావధిగా ముందుకు సాగుతున్న సుల్తానాబాద్ లయన్స్ క్లబ్, క్లబ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒకేరోజు 20 విశిష్ట సేవా కార్యక్రమాలను నిర్వహించి మరోసారి తన సేవా తపనను చాటుకుంది. లయన్స్ క్లబ్ గవర్నర్ మోర భద్రేశం ఆదేశాల మేరకు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆరోగ్యం, విద్య, పర్యావరణం, రోడ్డు భద్రత, సామాజిక సేవ, రైతు సంక్షేమం వంటి అనేక రంగాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. మార్నింగ్ వాకర్స్‌కు మధుమేహంపై అవగాహన కల్పించడం, మున్సిపల్ పరిశుద్ధ కార్మికులు, ప్రభుత్వ ఆసుపత్రిరోగులకు అల్పాహారం అందించడం, బస్టాండ్‌లో నేత్రదానంపై ప్రచారం, జాతీయ రహదారిపై హెల్మెట్ వినియోగం, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సుల్తానాబాద్ మండలం నరసయ్యపల్లి, గర్రెపల్లి గ్రామాల్లో హరితహారం నిర్వహించి వంద మొక్కలు నాటడంతో పాటు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించారు. ప్రతి విద్యార్థి తన పుట్టినరోజు సందర్భంగా ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. వలస కార్మికులకు నిత్యావసర సరుకులు, నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్లు పంపిణీ చేశారు. మానసిక వికలాంగుల కేంద్రంలో భోజన విందు, డాక్టర్స్ డే సందర్భంగా వైద్యుల సన్మానం, పోస్టల్ డే, చార్టెడ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా ఆయా రంగాల ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. పాఠశాలల్లో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు, అంగన్‌వాడీ పిల్లలకు స్నాక్స్ పంపిణీ, ఆర్ఎంపీ వైద్యుల సన్మానం, రైతులకు వాతావరణ పరిస్థితులు, పంట మార్పిడిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులను సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు డా. జూపల్లి తిరుమలరావు మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించడం లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో క్లబ్ కార్యదర్శి ఎర్రబెల్లి సుదీర్‌రావు, కోశాధికారి తమ్మనవేని సతీష్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్ జులూరి అశోక్, సభ్యులు దీకొండ భూమేష్, పూసాల సాంబమూర్తి, పిట్టల ప్రభాకర్, నోముల వేణుగోపాల్, కోడూరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించరాదు

**జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



**నిర్మల్ ప్రతినిధి, జూలై 1 (నినాదం):** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత మరియు ప్రజా ప్రశాంతత దృష్ట్యా 01 జూలై 2026 నుంచి 31 జూలై 2026 వరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్-30 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సెక్షన్-30 అమలులో ఉన్న కాలంలో సంబంధిత పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, బహిరంగ సభలు, సమావేశాలు లేదా ప్రజలు అధిక సంఖ్యలో గుమికూడే కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎటువంటి చర్యలకు పాల్పడినా, లేదా ముందస్తు అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులు, పాల్గొన్న వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా, సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం, వదంతులు, మత విద్వేషాలు లేదా సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు, సందేశాలు, వీడియోలు లేదా ఇతర అభ్యంతరకర సమాచారాన్ని ప్రసారం చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి పోలీసు శాఖకు సహకరించాలని, ఏదైనా సభ, సమావేశం లేదా ఇతర బహిరంగ కార్యక్రమాన్ని నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసి అనుమతి పొందిన తర్వాత మాత్రమే నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

# ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష



**సుల్తానాబాద్, జూలై1 (నినాదం):** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం శివపల్లి గ్రామం, సుల్తానాబాద్ మున్సిపాలిటీ 2వ వార్డు లో జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సుల్తానాబాద్ మండలం రెబ్బల్ దేవ్‌పల్లిలో కొనసాగుతున్న భూముల సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా బీఎల్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఫారం మస్నింపడంలో ప్రతి ఓటరికి అవసరమైన సహకారం అందించాలని, సేకరించిన ఫారాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రెబ్బల్ దేవ్‌పల్లిలో భూముల సర్వేను పరిశీలించి, పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు యాకన్న, బషీరుద్దీన్, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, బీఎల్వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలి : కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లో భోజనం చేసిన కలెక్టర్**




**నిర్మల్ ప్రతినిధి, జూలై 01 (నినాదం):** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం రుచికరంగా, నాణ్యతతో ఉందని నిర్వాహకులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ప్రజలు, అధికారులు, ఉద్యోగులకు ప్రతి రోజూ పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. క్యాంటీన్‌లో పరిశుభ్రత ప్రమాణాలను నిరంతరం పాటిస్తూ, సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని ఆదేశించారు. భోజనం అనంతరం కలెక్టర్ యూపీఐ (ఖ్యూ×) ద్వారా భోజనానికి సంబంధించిన చెల్లింపును స్వయంగా చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లో భోజనం చేశారు.

# ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం కోసం జూలై15 లోగా దరఖాస్తు చేసుకోవాలి

**జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు**

**జూలై 31లోపు ఆన్ లైన్ దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలి**



**పెద్దపల్లి రూరల్, జూలై1 (నినాదం):** ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం క్రింద స్కాలర్ షిప్, ఆర్థిక సహాయం కొరకు అర్హత కలిగిన మైనార్టీస్ విద్యార్థులు జూలై 15 లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసి, జూలై 31లోపు ఆన్ లైన్ దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అండ్ కమీషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లాలోని మైనారిటీ ముస్లింలు, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన్ మరియు పార్సీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం క్రింద స్కాలర్ షిప్, ఆర్థిక సహాయం కొరకు, డిగ్రీ మరియు ఇంజనీరింగ్ లో 60 శాతం మార్కులు ఉండి పోస్టు గ్రాడ్యుయేట్ చేయుటకు, పి. జి. లో 60 శాతం మార్కులు వచ్చి డాక్టరేట్ చదువుటకు 2026 జనవరి 1 నుండి జూన్ 30,2026 వరకు విదేశీ యూనివర్సిటీలలో అడ్మిషన్ పొందిన మైనార్టీ విద్యార్థులు ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారుని కుటుంబ సంవత్సర ఆదాయం 5 లక్షల రూపాయల లోపు ఉండాలని, అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా దేశాలలోని యూనివర్సిటీలలో అడ్మిషన్ పొంది ఉండాలని, మిగతా అర్హత వివరాలకు వెబ్సైట్ చూడాలని సూచించారు. అర్హత కలిగిన మైనార్టీ విద్యార్థులు జూలై15, 2026 సాయంత్రం 5:00 గంటల లోపు www.telanganaepass.cgg.gov.in వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకొని, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు జతల జిరాక్స్ ప్రతులను జూలై 31,2026 సాయంత్రం 5:00 గంటల లోపు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ, పెద్దపల్లి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఎంపికైన విద్యార్థులకు 20 లక్షల రూపాయల ఉపకార వేతనము ఆర్థిక సహాయం రెండు విడతలలో 60 వేల రూపాయల వరకు విమాన చార్జీలు చెల్లించబడతాయని, ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గల్ఫ్ మృతుని కుటుంబానికి అండగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**మృతదేహాన్ని స్వదేశానికి పంపేలా చర్యలు**

**సంబంధిత అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి**



**నిర్మల్ ప్రతినిధి/సారంగా పూర్, జులై 1(నినాదం):** సారంగా పూర్ మండల కేంద్రానికి చెందిన ఒడ్డే నర్సింలు బ్రతుకు తెరువు కోసం ఉపాధి నిమిత్తం దుబాయ్ కి వెళ్ళాడు, గత మూడు రోజుల క్రితం దుబాయ్ లో అనారోగ్య కారణంగా నర్సింలు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు మండల బీజేపీ నాయకులు సమాచారాన్ని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి గారి దృష్టికి తీసుకురావడంతో హుటాహుటిన స్పందించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంబంధిత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులతో, NRI సెల్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా మృత దేహాన్ని స్వదేశానికి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# బీఆర్ఎస్ అప్పులపై చర్చకు సిద్ధమా?

## కేటీఆర్‌కు మంత్రి జూపల్లి సవాల్

**హైదరాబాద్ బ్యూరో జులై 1 (నినాదం)**



తెలంగాణను మిగులు రాష్ట్రం నుంచి రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులతో నిండిన రాష్ట్రంగా బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చిందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. సీఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, డా. రాజేష్ రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను చెప్పిన అప్పుల లెక్కలు తప్పని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, అదే నిజమైతే కేటీఆర్ స్పీకర్‌కు రాజీనామా లేఖ ఇవ్వడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలన గొప్పదైతే ప్రజలు ఎందుకు ఓడించారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.20,157 కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసి చరిత్ర సృష్టించిందని, బీఆర్ఎస్ మాత్రం నాలుగేళ్లు తీసుకుందని అన్నారు. ఎన్నికల ముందు రైతుబంధు నిధుల కోసం ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చిందని ఆరోపించారు.బీఆర్ఎస్ మేనిఫెస్టోలో ఇచ్చిన దళితులకు మూడెకరాల భూమి, రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ ఆశయాలకు కేసీఆర్ పాలనకు సంబంధం లేదని, అవినీతి, అక్రమాలతో రాష్ట్ర సంపదను దోచుకున్నారని ఆరోపించారు.హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించిన ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రధాన ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంపై ఆధారరహిత ఆరోపణలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.

# ఓటర్ల జాబితా సవరణలో బూత్ లెవల్ ఏజెంట్లదే కీలక పాత్ర

## పటాన్ చెరులో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి





**రామచంద్రపురం, జులై 1(నినాదం) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి బూత్ లెవల్ ఏజెంట్లకు (బి.ఎల్.ఏలకు) దిశానిర్దేశం చేశారు.రామచంద్రాపురంలోని బాలాజీ గార్డెన్స్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా ఖచ్చితత్వం చాలా ముఖ్యమని, క్షేత్రస్థాయిలో బి.ఎల్.ఏలు అప్రమత్తంగా ఉండి, ప్రతి అర్హులైన ఓటరు నమోదును పర్యవేక్షించాలని కోరారు. ఫారం 6, 7, 8ల వినియోగం, ఓటర్ల వివరాల క్రమబద్ధీకరణలో పాటించాల్సిన ఎన్నికల సంఘం నిబంధనలను ఆయన వివరించారు.సదస్సులో పాల్గొన్న పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఈ ప్రక్రియలో బి.ఎల్.ఏలు పార్టీకి వెన్నెముక వంటి వారని పేర్కొన్నారు. "ఏ ఒక్క అర్హుడైన ఓటరు పేరు జాబితా నుండి తొలగిపోకూడదు. అదేవిధంగా, అనర్హుల పేర్లు చేరకుండా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో వ్యవహరించాలి," అని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కోఆర్డినేటర్ వెన్నెల, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ గాలి అనిల్ కుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్ తదితర ముఖ్య నాయకులు మరియు భారీ సంఖ్యలో బి.ఎల్.ఏలు పాల్గొన్నారు.

# కామారెడ్డి పట్టణంలో శాశ్వత తాగునీటి సమస్యకు పరిష్కారం

## ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 1 ( నినాదం)**





కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో సీనియర్ సిటిజన్స్ ఫోరం సమీపంలో అమృత్ (ఏ.ఎం.ఆర్.యు.టి) పథకం కింద నిర్మించనున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులకు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి పట్టణ ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద రూ.93 కోట్లతో సమగ్ర తాగునీటి ప్రాజెక్టును చేపట్టిందన్నారు.ఈ ప్రాజెక్టు కింద పట్టణంలో మొత్తం 9 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించగా,ఇప్పటికే 8 ట్యాంకుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు.విద్యానగర్ ప్రాంతంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థల సమీకరణలో కొంతకాలంగా ఇబ్బందులు ఎదురయ్యాయని,చివరకు రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ కేటాయించిన స్థలంలో ట్యాంక్ నిర్మాణానికి అవకాశం లభించడంతో నేడు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు.ఈ స్థలాన్ని ప్రజా ప్రయోజనం కోసం అందించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ తొమ్మిదో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయితే కామారెడ్డి పట్టణంలో తాగునీటి సరఫరా మరింత సమర్థవంతంగా జరిగి,నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని షబ్బీర్ పేర్కొన్నారు.అలాగే పట్టణంలో దాదాపు 100 కిలోమీటర్ల మేర చేపట్టిన కొత్త తాగునీటి పైప్‌లైన్ పనులు కూడా పూర్తికావచ్చాయని,త్వరలోనే ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీటిని అందించే లక్ష్యాన్ని ప్రభుత్వం సాధిస్తుందని చెప్పారు.ముఖ్యమంత్రి నాయకత్వంలో కామారెడ్డి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని విధాలా కృషి కొనసాగుతుందని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఐరేని సందీప్,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు భూమని బాలరాజ్,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు,రెడ్డి నాయక్,రాజా గౌడ్,నౌసిలాల్ నాయక్,నరేందర్ రెడ్డి, అంకం కృష్ణారావు,పండ్ల రాజు,కారంగుల అశోక్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,భీమ్ రెడ్డి,సుతారి రమేష్,తిరుమల గౌడ్,ఐరేని నర్సయ్య, సత్యం,అన్వర్ అహ్మద్,అంజద్, లడ్డు,వాజిద్,గూడెం శ్రీనివాస్ రెడ్డి,సిద్దిక్,జావిద్,మాజీద్,మసూద్,యూనిస్,ప్రజాప్రతినిధులు,మున్సిపల్ అధికారులు,ఇంజినీరింగ్ శాఖ అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,స్థానిక ప్రజలు,కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అన్ని వృత్తుల్లో వైద్య వృత్తి అత్యంత గొప్పది

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 1 (నినాదం)**

ప్రజల ప్రాణాలను కాపాడుతూ సమాజానికి అమూల్యమైన సేవలు అందిస్తున్న వైద్యుల సేవలు ఎనలేనివని,అన్ని వృత్తుల్లో వైద్య వృత్తి అత్యంత గొప్పదని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.జాతీయ వైద్యుల దినోత్సవం (డాక్టర్స్ డే) సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా వైద్యాధికారులను సన్మానించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం జూలై 1న ప్రముఖ వైద్యుడు,స్వాతంత్ర్య సమరయోధుడు, జయంతి,వర్ధంతి సందర్భంగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు.వైద్యులు తమ జ్ఞానం,నైపుణ్యం,సేవాభావంతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు.రోగుల పట్ల మానవత్వం,సహానుభూతితో వ్యవహరిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు నిరంతరం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటి,డిసిహెచ్ఎస్ఓ గోపాల్,వైద్యాధికారులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఫ్యామిలీ డ్రామాకు తోడు క్రైం థ్రిల్లర్

## ఆదర్శకుటుంబం స్టోరీపై చర్చ

NINADAM CINEMA



విక్టరీ వెంకటేష్ హీరోగా, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న ఆదర్శ కుటుంబంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు క్రైం థ్రిల్లర్ అంశాలను జోడిస్తూ రూపొందుతున్న ఈ చిత్రం విడుదల తేదీని ఇటీవల చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. విక్టరీ వెంకటేష్ హీరోగా, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న ఆదర్శ కుటుంబంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. సినిమాలో సుదీర్ఘంగా సాగే ఓ ట్రైన్ ఎపిసోడ్‌ను ప్రత్యేకంగా రూపొందించారట. సిట్యుయేషనల్ కామెడీతో నిండిన ఈ సన్నివేశం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందని టాక వినిపిస్తోంది. ఇటీవలే ఈ ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయిందని, ఇందులో వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లను వినోదాత్మకంగా తెరకెక్కించడంలో త్రివిక్రమ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. మరోవైపు కామెడీ, భావోద్వేగ సన్నివేశాల్లో వెంకటేష్‌కు ఉన్న టైమింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమాను హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఇటీవల ఆయన అందించిన బ్యాకగ్రౌండ్ స్కోర్లు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, ఈ సినిమాపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం 'ఆదర్శ కుటుంబం' షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం.

# ఆల్ఫా సెన్సార్ పూర్తి... 3న విడుదల



శివ్ రావైల్ దర్శకత్వంలో, అలియా భట్, శర్వరి ప్రధాన పాత్రలు పోషిస్తున్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. జులై 3న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా తాజాగా సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఇప్పటికే యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సినిమాలో కొన్ని మార్పులు చేయాలని కోరింది. ద్వితీయార్థంలో వచ్చే కొన్ని సన్నివేశాల తీవ్రతను తగ్గించి, ప్రత్యామ్నాయ దృశ్యాలను పెట్టాలని సూచించింది. ప్రథమార్థంలోని ఓ డైలాగ్‌ను తొలగించి, మరో రెండు సంఘటనల విజువల్స్‌ను తగ్గించాలని ఆదేశించింది. మద్యం తీసుకునే సన్నివేశాల్లో గమనిక వేయాలని, మూవీలోని అన్ని పాటలకూ సబ్‌టైటిల్స్ జోడించాలని కోరింది. సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ కోసం వారి తల్లిదండ్రుల నుంచి అనుమతి లేఖను సమర్పించాలని ఆదేశించింది. తాజాగా ఆల్ఫా ఈ పనులన్నీ పూర్తి చేసుకుంది. ఈ భారీ యాక్షన్ సినిమా నిడివి 2 గంటల 20 నిమిషాల 48 సెకన్లు. ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ మూవీలో బాబీ దియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తుండగా, హృతిక రోషన్ అతిథి పాత్రలో కనిపించనున్నారు.

# రావు బహదూర్‌కు మహేశ్ వాయిస్ ఓవర్

## చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసిన నిర్మాణ సంస్థ

టాలీవుడ్ నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో, టాలెంటెడ్ డైరెక్టర్ వెంకటేష్ మహా దర్శకత్వంలో తెరకెక్కుతున్న సైకలాజికల్ డ్రామా 'రావు బహదుర్'. ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. సూపర్ స్టార్ మహేష్ బాబు సమర్పణలో జీఎమ్‌బి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమా ట్రైలర్‌కు స్వయంగా మహేష్ బాబే వాయిస్ ఓవర్ అందించడం విశేషం. నాటకానికి లాజిక ఉండదు అంటారు.. కానీ నాటకానికి మాయ తోడైతే లాజిక్కే మారిపోతుంది అంటూ సాగే మహేష్ బాబు గంభీరమైన వాయిస్ ఓవర్ ట్రైలర్‌కు ప్రాణం పోసింది. ఒక వ్యక్తి చనిపోవాల్సిన సమయం కంటే ఏడాది పాటు ఎక్కువ కాలం ఎలా బతికాడు ఒక చిన్న అనుమానం ఒక మనిషి జీవితాన్ని, అతని విధిని ఎలా మార్చేసింది.. అనే ఇంట్రెస్టింగ్ పాయింట్‌తో ట్రైలర్ సరికొత్తగా సాగింది. తెలుగు సినిమాలో ఇప్పటివరకు ఎవరూ చూడని ఒక మైండ్ బ్లోయింగ్ లాంటి ఎక్స్‌పీరియన్స్‌ను ఈ చిత్రం అందించబోతోందని మహేష్ బాబు తన వాయిస్ ఓవర్ ద్వారా హామీ ఇచ్చారు. చివరి స్టేజ్ లివర్ క్యాన్సర్‌తో మరణానికి దగ్గరై, మిరాకిల్‌గా బతికిన వ్యక్తిగా, 'రామప్ప' అలియాస్ 'రావు బహదుర్' పాత్రలో సత్యదేవ్ తన నట విశ్వరూపం చూపించారు. డార్క్ కామెడీ, సస్పెన్స్, మ్యాజికల్ రియలిజం కలబోసిన ఈ ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తోంది.



# వారణాసి మేజర్ షూటింగ్ పూర్తి



మరో 80 రోజుల టాకీ పార్ట్ మిలిందన్న జక్కన్న

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం 'వారణాసి' గురించి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆర్ఆర్ఆర్' రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న రాజమౌళి ఈ వారణాసి సినిమా విషయాలపై స్పందించాడు. ఈ చిత్రానికి సంబంధించిన మేజర్ యాక్షన్ ఎపిసోడ్స్ షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, కేవలం 80 రోజుల టాకీ, చిన్నపాటి బ్యాలెన్స్ షూటింగ్ మాత్రమే మిగిలి ఉందని ఆయన స్పష్టం చేశారు. నిర్మాత పక్కనే ఉన్నందున ఎక్కువ విషయాలు చెప్పలేనని నవ్వుతూనే, ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ కల్లా పూర్తి షూటింగ్‌ను ముగించేలా ప్లాన్ చేస్తున్నట్లు రాజమౌళి పేర్కొన్నారు. మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం, అనుకున్న సమయానికే అంటే ఏప్రిల్ 7, 2027న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోందని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు.

# టాక్సిక్ నుంచి లేడీస్ అండీస్ గ్లింప్స్ విడుదల



రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ గ్లింప్స్ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న హై-బడ్జెట్ చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఇప్పటివరకు యష్ లుక్స, యాక్షన్‌తోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన మేకర్స్, తాజాగా ఈ చిత్రంలోని పవర్‌ఫుల్ మహిళా పాత్రలను పరిచయం చేస్తూ మరింత బోల్డ్‌గా 'లేడీస్ అండ్ లేడీస్' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ ఊహించని విధంగా అత్యంత బోల్డ్, రా అండ్ రస్టిక విజువల్స్‌తో సాగింది. చిత్రంలో నటిస్తున్న లేడీస్ అందరినీ గ్యాంగ్‌స్టర్ బ్యాకడ్రోప్‌లో ఎంతో పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేశారు. నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా, మరియు రుక్మిణి వసంత్ లతో కూడిన ఈ భారీ లేడీ కాస్టింగ్ గ్లింప్స్‌లో మునుపెన్నడూ చూడని బోల్డ్ అవతార్లలో కనిపించి షాక ఇచ్చారు. బ్యాకగ్రౌండ్ స్కోర్, అద్భుతమైన విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. 'డాడీ ఈజ్ హోమ్' అంటూ యష్ ఎంతటి పవర్‌ను చూపించాడో, ఈ లేడీ గ్యాంగ్ అంతకంటే ఎక్కువ 'టాక్సిక్'గా ఉండబోతోందని ఈ గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. కెవిఎన్ ప్రొడక్షన్స్ మరియు యష్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ పాన్-ఇండియా చిత్రం ఆగస్ట్ 26, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028
Published at 6-3-439, Kisannagar, Karimnagar-505001(TS) Editor: B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787